Follow: @ANNTELUGU
04-06-2026
ANN తెలుగు
# మహా పత్రిక
గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 156 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## రాక్ వెల్ స్కూల్ కు
# నోటీసులు

- విద్యాశాఖాధికారి వెల్లడి
- మహా ఎఫెక్ట్

(మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్): రంగారెడ్డి జిల్లా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శంషాబాద్ సర్కిల్ పరిధిలో శాతంరాయి గ్రామంలో రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం నిబంధనల ఉల్లంఘన, అక్రమాలపై మహా పత్రికలో వచ్చిన వరుస కథనాలకు విద్యాశాఖ అధికారులు స్పందించారు. జీవో 111ను తుంగలో తొక్కి, జీ హెచ్ ఎం సీ నుండి ఎటువంటి నిర్మాణ అనుమతులు తీసుకోకుండానే 8.5ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. భవనానికి ఆక్యుపెన్సీ, నిర్మాణ అనుమతుల పత్రాలు, ఫైర్ సేఫ్టీ లేకుండానే విద్యాశాఖ అధికారులు రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్ నడిపేందుకు అడ్డదారిలో అనుమతులు జారీ చేయటంపై తీవ్ర విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. రాక్ వెల్ స్కూల్ పై మహా కథనాలు, వరుస ఫిర్యాదుల నేపథ్యంలో యాజమాన్యానికి భవన నిర్మాణ అనుమతులు, ఫైర్ సేఫ్టీ అనుమతులు చూపాలని నోటీసులు జారీచేసినట్లు మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ తెలిపారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే కార్పొరేట్ కక్కుర్తిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు.


03

టాప్ న్యూస్

## రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డుల మోత

ఒక్క నెలలోనే రూ.1,700 కోట్ల ఆదాయం!

- సిరాస్తి రంగంలో సరికొత్త ఉత్సాహం.
- కిటకిటలాడుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు.



02

## కాంగ్రెస్‌కు విజయ్ గిఫ్ట్

తమిళనాడు రాజ్యసభ సీటు కేటాయింపు



02

## ఆన్ లైన్ బెట్టింగ్ పై సుప్రీంకోర్టు కొరడా

- జూదం మౌలిక హక్కు కాదు
- రమ్మీ..పోకర్ యాప్ లకు నో ఎంట్రీ
- దేశవ్యాప్త నిషేధానికి దారి.. రాష్ట్రాలకే ఫుల్ పవర్స్



03



## కర్ణాటక సీఎంగా డీకే

- మంత్రులుగా 13 మంది ప్రమాణ స్వీకారం
- సిద్ధరామయ్య, ఖర్గే కుమారులకు మంత్రివర్గంలో దక్కిన చోటు
- హాజరైన రాహుల్, ఖర్గే, మాజీ సీఎం సిద్ధరామయ్య, సీఎం రేవంత్ రెడ్డి

02

TG RERA

## బాలాజి కన్‌స్ట్రక్షన్స్‌కు ‘టీజీ రెరా’ అల్టిమేటం

- 60 రోజుల్లో వసతులు పూర్తి చేయాల్సిందే.. లేకుంటే కఠిన చర్యలు.
- బాలాజీ ఎలిగాన్సియా' డెవలపర్‌కు రెరా స్పష్టమైన ఆదేశాలు.
- కొనుగోలుదారుల పక్షాన నిలిచిన అథారిటీ.. చారిత్రాత్మక తీర్పు.




## ఇక తెలంగాణపై కాంగ్రెస్
# ఫోకస్!

### దక్షిణాది దిగ్విజయం దిశగా అడుగులు..

2029 లక్ష్యంగా హైకమాండ్ వ్యూహాత్మక జైత్రయాత్ర

జూన్ ఆఖరు నుంచి తెలంగాణ కాంగ్రెస్‌లో భారీ ప్రక్షాళన

ఒకటి రెండు మాసాల్లో కొలిక్కి రానున్న

మంత్రివర్గ విస్తరణ, కీలక పదవుల భర్తీ!


(హైదరాబాద్ మహా పత్రిక ప్రత్యేక ప్రతినిధి): కాంగ్రెస్ దక్షిణాదిపై ఉత్సాహంగా ఉంది. సార్వత్రిక సమరంలో దక్షిణాది రాష్ట్రాలు అందించిన నైతిక బలం, రాజకీయ ఉత్తేజంతో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సరికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. కర్నాటకలో ముఖ్యమంత్రి మార్పు అత్యంత సాఫీగా, ఆశించిన రీతిలో ముగియడంతో అధిష్టానం శ్రేణుల్లో నూతనోత్సాహం ఉప్పొంగుతోంది. అదే సమయంలో పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళంలలో వెలువడిన అనుకూల ఫలితాలు హస్తం పార్టీకి కొండంత అండగా నిలిచాయి. ఈ వరుస విజయాల జోష్‌తో, కాంగ్రెస్ అధినాయకత్వం ఇప్పుడు తన పూర్తి దృష్టిని తెలంగాణ రాష్ట్రంపై కేంద్రీకరించింది. రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలే పరమావధిగా.. దక్షిణాదిలో ఏకంగా 90 శాతం స్థానాలను కొల్లగొట్టడమే ఏకైక లక్ష్యంగా కాంగ్రెస్ హైకమాండ్ ‘మిషన్ సౌత్’ యాక్షన్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూకుడు పక్క రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్ కు ఉత్సాహం కలిగిస్తుండగా, తెలంగాణలో రేవంత్, కర్నాటకలో డీకే శివకుమార్, కేరళలో వీడీ మిగతా 3వ పేజీలో



## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### దక్షిణాఫ్రికా బృందానికి సీఎం రేవంత్ పిలుపు

హైదరాబాద్, మహా : తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా పారిశ్రామికవేత్తలకు అవసరమైన తోడ్పాటును అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణదక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా, హైదరాబాద్ వచ్చిన దక్షిణాఫ్రికా ఉపాధ్యక్షుడు పాలస్ మషటైల్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఇరు పక్షాలు తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ, సీఎస్ రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ తరుపున సహకారం అందిస్తామని, పెట్టుబడులకు సహకరిస్తామని కోరారు.



## నేటి నుంచే భూముల విలువల పెంపు

- శాస్త్రీయ అధ్యయనం మేరకే కొత్త ధరల నిర్ధారణ.
- అధికారికంగా ప్రకటించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.




02

## ఏనుమాముల మార్కెట్ చైర్ పర్సన్ గా యార్ర ప్రియాంక

- బాధ్యతలు స్వీకరణ
- రైతుల సమస్యల పరిష్కారం, మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తామని చైర్‌పర్సన్ హామీ

03



## ఢిల్లీలో మహా విషాదం

### అగ్నికి ఆహుతైన 21 ప్రాణాలు

- ఫ్లోరిష్ స్టే హోటల్‌లో ఘోర అగ్నిప్రమాదం.
- మృతుల్లో అత్యధికంగా విదేశీయులే.
- భవనం పైనుంచి దూకేసిన మహిళలు.
- పరుపులు వేసి ప్రాణాలు కాపాడిన స్థానికులు.
- వైద్యం కోసం భారత్‌కు వచ్చి మృత్యువాత పడిన వైనం.

02



## తెలంగాణ మా భూమి పుత్రుల జాగీరే

### పవన్ కల్యాణ్‌కు కేటీఆర్ స్ట్రాంగ్ కౌంటర్

సచివాలయంలో కూర్చుని పెత్తనం చేస్తామంటే సహించం.

పొట్టి శ్రీరాములు చేసింది ప్రాంతీయవాదం కాదా? మోదీది ఆర్థిక ప్రాంతీయవాదం కాదా?

ఇంటికొస్తే బిర్యానీ పెడతాం.. కానీ మాపై ఆధిపత్యం ప్రదర్శిస్తే ఊరుకోం.

పవన్ వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్.

03







# ఢిల్లీలో మహా విషాదం

**ఢిల్లీ, మహా. :** దేశ రాజధాని ఢిల్లీలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. దక్షిణ ఢిల్లీలోని హౌజ్ రాణి ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఏకంగా 21 మంది సజీవ దహనమయ్యారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని మెరుగైన వైద్య చికిత్సల కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విదేశీయులను మృత్యువు అగ్నికీలల రూపంలో కబళించింది. 'ఫ్లోరిష్ స్టే' అనే హోటల్‌లో తెల్లవారుజామున అందరూ గాఢ నిద్రలో ఉన్న సమయంలో ఈ మహమ్మారి మంటలు ఒక్కసారిగా చెలరేగడంతో ఈ ఘోర విషాదం సంభవించింది. ఐదంతస్తుల భవనంలో ఉన్న ఈ హోటల్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని రెస్టారెంట్‌లో తొలుత మంటలు అంటుకున్నట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. క్షణాల వ్యవధిలోనే మంటలు పై అంతస్తులకు వేగంగా వ్యాపించడంతో పాటు దట్టమైన పొగ కమ్ముకుంది. ఉదయం సమయం కావడంతో హోటల్లోని ప్రయాణికులంతా గాఢ నిద్రలో ఉండిపోయారు. పొగ, మంటల వేడికి ఉలిక్కిపడి లేచిన వారికి ఏటూ వెళ్లాలో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. కిందకు దిగే మార్గాలన్నీ మంటలతో మూసుకుపోవడంతో కళ్ల ముందే మృత్యువు తాండవిస్తున్నా నిస్సహాయ స్థితిలో గదుల్లోనే చిక్కుకుని ప్రాణాలు వదిలారు. ఈ హోటల్‌లో సుమారు 25 గదులు ఉండగా, ప్రమాదం జరిగిన సమయంలో 40 మందికి పైగా బస చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వీరిలో అత్యధికంగా వైద్య చికిత్సల కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులే ఉన్నారని ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ సైతం వెల్లడించింది. ఎన్నో ఆశలతో ఆరోగ్యంతో తిరిగి తమ స్వదేశాలకు వెళ్లాలనుకున్న వారిని ఈ ప్రమాదం బలితీసుకోవడం ప్రతీ ఒక్కరినీ తీవ్రంగా కలచివేస్తోంది. మృతుల్లో ఉన్న విదేశీయుల వివరాలను, వారి స్వస్థలాలను తెలుసుకునేందుకు అధికారులు ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో సంప్రదింపులు జరుపుతున్నారు.

కిటికీల నుంచి కిందకు దూకేసిమంటలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండటంతో ప్రాణభయంతో కొందరు మహిళలు భవనం పై అంతస్తుల కిటికీల నుంచి కిందకు దూకేశారు. ఈ దృశ్యాలు చూసిన స్థానికులు తక్షణమే అప్రమత్తమై మానవత్వాన్ని చాటుకున్నారు. కింద పరుపులు పరిచి పైనుంచి దూకుతున్న వారిని పట్టుకుని ప్రాణాలతో రక్షించారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దట్టమైన పొగలు, మంటల నడుమ మహిళలు కిందకు దూకుతున్న వీడియోలు అందరి కంటతడి పెట్టిస్తున్నాయి. స్థానికులు చూపించిన ఈ సమయస్ఫూర్తి వల్ల ఎంతో మంది ప్రాణాలు దక్కించుకోగలిగారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, హోటల్ ఉన్న ప్రాంతం అత్యంత ఇరుకైన సందుల్లో ఉండటంతో అగ్నిమాపక శకటాలు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేయడానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. సిబ్బంది శ్రమించి క్రమంగా మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దుర్ఘటనపై ఎస్‌డీఎం జితేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా వెల్లడి కాలేదని, గ్రౌండ్ ఫ్లోర్ రెస్టారెంట్ నుంచే మంటలు వ్యాపించినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. స్థానికులు సమయస్ఫూర్తితో పరుపులు వేయడం వల్లే పైనుంచి దూకిన వారు ప్రాణాలతో బయటపడగలిగారని ఆయన ప్రశంసించారు. ఈ ఘోర ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

# బాలాజీ కన్‌స్ట్రక్షన్స్‌కు ‘టీజీ రెరా’ అల్టిమేటం

**హైదరాబాద్, మహా :** విలాసవంతమైన వసతులు కల్పిస్తామని నమ్మబలికి, తీరా విల్లాలు విక్రయించాక ముఖం చాటేస్తున్న రియల్ ఎస్టేట్ డెవలపర్ల ఆటలు ఇక సాగవని తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) స్పష్టం చేసింది. కొనుగోలుదారుల హక్కులను కాలరాస్తే ఏమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా ఓ కీలక తీర్పును వెలువరించింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కొంపల్లిలో ‘బాలాజీ ఎలిగాన్సియా’ పేరిట విల్లా ప్రాజెక్టును చేపట్టిన డెవలపర్ ‘మెసర్స్ బాలాజీ కన్‌స్ట్రక్షన్స్’కు రెరా గట్టి షాకిచ్చింది. ప్రాజెక్టులో అసంపూర్తిగా వదిలేసిన మౌలిక సదుపాయాలు, ఉమ్మడి వసతులను కేవలం 60 రోజుల్లోగా పూర్తి చేయాలని డెవలపర్‌ను ఆదేశిస్తూ కఠినమైన ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమోటర్ల జవాబుదారీతనాన్ని నిర్ధారిస్తూ రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్) చట్టం2016 నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని ఈ తీర్పు ద్వారా అథారిటీ తేల్చిచెప్పింది.

బాలాజీ ఎలిగాన్సియా ప్రాజెక్టులో విల్లాలు కొనుగోలు చేసిన వినియోగదారులు.. బాలాజీ ఎలిగాన్సియా విల్లా ఓనర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ మెయింటెనెన్స్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రెరాను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. బ్రోచర్లు, సేల్ అగ్రిమెంట్లలో డెవలపర్ ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, కానీ క్షేత్రస్థాయిలో అవి అమలు కాలేదని కొనుగోలుదారులు తమ ఫిర్యాదు (నెం. 375/2025)లో పేర్కొన్నారు. పూర్తిస్థాయి క్లబ్ హౌస్, మురుగునీటి శుద్ధి కేంద్రం వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, వంద శాతం పవర్ బ్యాకప్, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పిస్తామని చెప్పి మోసం చేశారని అథారిటీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విచారణ చేపట్టిన రెరా.. ప్రాజెక్టు వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ద్వారా థర్డ్‌పార్టీ భౌతిక తనిఖీని చేయించింది. ఈ తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. అప్పటికే చాలా విల్లాలు అమ్ముడుపోయి, ప్రజలు నివాసం ఉంటున్నప్పటికీ ప్రాథమిక పౌర సదుపాయాలు, ఉమ్మడి వసతుల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయని ఈఎస్‌సీఐ నిపుణుల బృందం నిర్ధారించింది. వాస్తవానికి 2024 సెప్టెంబర్ 1 నాటికే ఈ ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉన్నా, పనులు మాత్రం ఎక్కడికక్కడే నిలిచిపోయినట్లు అధికారులు గుర్తించారు.

ఈ వ్యవహారంపై డెవలపర్ వ్యక్తం చేసిన అభ్యంతరాలను, సాకులను అథారిటీ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ప్రాజెక్టు గడువు పొడిగింపులో ఉందని, రెసిడెంట్స్ అసోసియేషన్‌కు చట్టపరమైన గుర్తింపు లేదంటూ డెవలపర్ చేసిన వాదనలను రెరా చట్టంలోని సెక్షన్ 37, 38 కింద లభించిన అధికారాలతో అథారిటీ కొట్టివేసింది. ప్రాజెక్టులో మూడింట రెండొంతుల (2/3) కంటే ఎక్కువ ఇళ్లలో ఇప్పటికే కొనుగోలుదారులు నివాసం ఉంటున్నప్పుడు, వాగ్దానం చేసిన అన్ని మౌలిక సదుపాయాలను అందించాల్సిన బాధ్యత డెవలపర్‌పై ఎంతైనా ఉంటుందని ఈ చారిత్రక తీర్పులో రెరా స్పష్టం చేసింది. ఈ బాధ్యత నుంచి డెవలపర్ ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని, ఇది నాన్‌నెగోషియబుల్ అని తేల్చిచెప్పింది.

ఈఎస్‌సీఐ ప్యానెల్ ముందు డెవలపర్ స్వయంగా అంగీకరించిన గడువులోగా పెండింగ్‌లో ఉన్న ఉమ్మడి వసతులన్నింటినీ తప్పనిసరిగా పూర్తి చేయాలని అథారిటీ ఆదేశించింది. ముఖ్యంగా, ఇప్పటికే గడువు ముగిసిన మౌలిక సదుపాయాల పనులను మాత్రం ఈ ఉత్తర్వులు వెలువడిన తేదీ నుంచి కచ్చితంగా 60 రోజుల్లోగా పూర్తి చేయాలని డెవలపర్‌కు కచ్చితమైన డెడ్‌లైన్ విధించింది. ఒకవేళ అథారిటీ జారీ చేసిన ఈ గడువును ఉల్లంఘిస్తే మాత్రం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చింది. ఏమాత్రం జాప్యం చేసినా చట్టంలోని సెక్షన్ 63 కింద ప్రమోటర్‌పై కఠినమైన శిక్షాత్మక చర్యలు, చట్టపరమైన ప్రాసిక్యూషన్ ఆటోమేటిక్‌గా ప్రారంభమవుతుందని టీజీ రెరా గట్టి హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పూర్తి పారదర్శకతను తీసుకురావడం, వినియోగదారుల హక్కులను కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని ఈ ఉత్తర్వుల ద్వారా రెరా మరోసారి స్పష్టం చేసింది.

## శిక్షణ తీసుకొని ఉపాధి పొందాలి

**లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి**

**మంచిర్యాల, మహా :** శిక్షణ తీసుకొని ఉపాధి పొందాలని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీఐ) లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి అన్నారు. బుధవారం ఆర్‌సెటీఐ మంచిర్యాల లో ఏర్పాటు చేసిన 14 రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యా కార్యక్రమ అధికారి శ్రీనివాస్, ఆర్‌సెటీఐ సంచాలకులు ఆశిష్ వార్లే, కార్మల్ పాఠశాల ప్రిన్సిపల్ సారూప్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూట్ ఉత్పత్తుల రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్‌సెటీఐ ప్రత్యేక శిక్షకుల ద్వారా జూట్ బ్యాగుల తయారీకి సంబంధించిన సాంకేతిక అంశాలు, నాణ్యత ప్రమాణాలు, ముడి పదార్థాల ఎంపిక, ఉత్పత్తి ప్రక్రియ తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు, మార్కెటింగ్ టెక్నిక్స్, వ్యాపార నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం, ఇతర నైపుణ్యాభివృద్ధి అంశాలపై కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# రిజిస్ట్రేషన్ల శాఖ రికార్డుల మోత




**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో స్థిరాస్తి రంగం శరవేగంగా దూసుకుపోతోంది. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న రిజిస్ట్రేషన్లు మరియు స్టాంపుల శాఖ మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. తాజాగా కేవలం ఒక్క నెల వ్యవధిలోనే ఏకంగా రూ.1,700 కోట్ల మేర రికార్డు స్థాయి ఆదాయం సమకూరడం మార్కెట్ వర్గాలతో పాటు, ప్రభుత్వ వర్గాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత కొద్దికాలంగా స్థిమితంగా సాగుతున్నట్లు కనిపించిన రియల్ ఎస్టేట్ రంగం, ఒక్కసారిగా పుంజుకోవడంతో సబ్ రిజిస్ట్రార్కార్యాలయాలన్నీ కొనుగోలుదారులు, విక్రేతలతో కిటకిటలాడుతున్నాయి. *రాజధాని శివార్లలోనే అత్యధిక లావాదేవీలు* ప్రధానంగా రాజధాని నగర పరిసర ప్రాంతాలతో పాటు అభివృద్ధి చెందుతున్న ద్వితీయ శ్రేణి (టైర్2) నగరాల్లో సైతం ఆస్తుల కొనుగోళ్ల పట్ల ప్రజలు తీవ్ర ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి పరిధిలో అపార్ట్మెంట్ ఫ్లాట్లు, వాణిజ్య సముదాయాలు, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు భారీ సంఖ్యలో నమోదయ్యాయి. నలువైపులా విస్తరిస్తున్న రవాణా సదుపాయాలు, మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్తులో స్థలాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందన్న బలమైన అంచనాల నేపథ్యంలో.. సామాన్యుల నుంచి బడా పెట్టుబడిదారుల వరకు ఆస్తుల కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. ఈ పరిణామం నేరుగా ప్రభుత్వ ఖజానాకు కాసుల వర్షం కురిపిస్తోంది.

**పారదర్శక విధానాలే శ్రీరామరక్ష**

రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రభుత్వం మరింత సులభతరం చేయడం, ఆన్ లైన్ సేవలను విస్తృతం చేయడం కూడా ఈ రికార్డు స్థాయి ఆదాయానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. గతంలో ఉన్నట్లుగా రోజుల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా, స్లాట్ బుకింగ్ విధానం ద్వారా నిర్ణీత సమయంలోనే పనులు పూర్తవుతుండటంతో ప్రజల్లో నమ్మకం పెరిగింది. దళారీ వ్యవస్థకు చెక్ పెడుతూ, పారదర్శకతను పెంచడం ద్వారా లావాదేవీలు వేగవంతం అయ్యాయి. దీనికి తోడు ఐటీ కారిడార్ల విస్తరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటుతో వాణిజ్య అవసరాల కోసం జరిగే భూముల క్రయవిక్రయాలు కూడా ఊపందుకున్నాయి. సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు బ్యాంకులు అందిస్తున్న ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు, గృహ రుణాల మంజూరు ప్రక్రియ సులభతరం కావడం కూడా సామాన్యులను కొనుగోళ్ల వైపు నడిపిస్తోంది. రానున్న పండుగ సీజన్ల నేపథ్యంలోనూ, సానుకూల ఆర్థిక వాతావరణం ఇలాగే కొనసాగితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వానికి అంచనాలకు మించి ఆదాయం సమకూర్చే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇది రాష్ట్ర ప్రగతికి, సంక్షేమ పథకాల అమలుకు మరింత ఊతం ఇవ్వనుందని ప్రభుత్వ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# నేటి నుంచే భూముల విలువల పెంపు



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రేపటి నుంచి నూతన ధరలు అమల్లోకి రానున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారికంగా ప్రకటించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి శాస్త్రీయ ఆధారం లేకుండా అడ్డగోలుగా భూముల ధరలను పెంచారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుని, పక్కాగా శాస్త్రీయ అధ్యయనం మేరకే ఈ నూతన విలువలను నిర్ధారించిందని ఆయన స్పష్టం చేశారు. ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ నివేదిక, నిపుణుల సూచనల ఆధారంగా సామాన్యులకు భారం కాకుండా ఈ పెంపు ప్రక్రియను పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. అభివృద్ధి జరుగుతున్న ప్రాంతాలు, మౌలిక సదుపాయాల కల్పన ఆధారంగా కొత్త ధరల నిర్ణయం జరిగింది. చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ మార్కెట్ విలువకు, బహిరంగ మార్కెట్ ధరకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని సరిచేసే దిశగా ప్రభుత్వం ఈ అడుగు వేసింది. ఓపెన్ ప్లాట్లు, వ్యవసాయ భూములు, అపార్ట్‌మెంట్లు.. ఇలా అన్ని రకాల ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువలపై ఈ పెంపు ప్రభావం పడనుంది. వాస్తవ పరిస్థితులను అనుసరించి ప్రాంతాన్ని బట్టి ఈ పెరుగుదల కనిష్ఠంగా ఐదు శాతం నుంచి గరిష్ఠంగా వంద శాతం వరకు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి ఉన్న భూములు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని స్థలాల విలువల్లో గణనీయమైన మార్పులు ఉండనున్నాయి. ధరల పెంపు నేపథ్యంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద ప్రజల రద్దీ విపరీతంగా పెరిగింది. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు క్రయవిక్రయదారులు ఉదయం నుంచే కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ శివారు ప్రాంతాలైన మహేశ్వరం, గండిపేట, శేరిలింగంపల్లి, షాద్‌నగర్, ఫరూఖ్‌నగర్, సరూర్ నగర్ తదితర కీలక ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ల కోలాహలం నెలకొంది. ప్రజల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రెవెన్యూ శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. స్లాట్ బుకింగ్స్ సంఖ్యను పెంచడంతో పాటు, కార్యాలయాల పనివేళలను పొడిగించింది. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు నిరంతరాయంగా రిజిస్ట్రేషన్ సేవలు అందించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ భూముల విలువల సవరణకు సంబంధించిన డేటాను ఇప్పటికే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల స్థాయిలో ఈ ఆన్‌లైన్ అప్‌డేషన్ దాదాపు తుది దశకు చేరుకుంది. రేపటి నుంచి కొత్త మార్గదర్శకాలు, నూతన మార్కెట్ విలువల ప్రకారమే ఆస్తుల రిజిస్ట్రేషన్ లావాదేవీలు జరగనున్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ వర్గాలు ఈ పరిణామాలను ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# ఆన్ లైన్ బెట్టింగ్ పై సుప్రీంకోర్టు కొరడా

**జూదం మౌలిక హక్కు కాదు**

**రమ్మీ..పోకర్ యాప్ లకు నో ఎంట్రీ**

దేశవ్యాప్త నిషేధానికి దారి.. రాష్ట్రాలకే ఫుల్ పవర్స్

న్యూఢిల్లీ, మహా : ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్‌లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నైపుణ్యంతో కూడిన ఆటలైనా సరే డబ్బులు పెట్టి బెట్టింగ్ కాస్తే రాజ్యాంగ రక్షణ ఉండదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధిస్తూ తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాలు చేసిన చట్టాలు పూర్తిగా చెల్లుతాయని స్పష్టం చేసింది. ఆన్‌లైన్ జూదాలను నిషేధించే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఉంటుందని వెల్లడించింది. బెట్టింగ్ వ్యాపారం ఎవరికీ 'మౌలిక హక్కు' కాదని ధర్మాసనం తేల్చిచెప్పింది. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు, గేమింగ్ కంపెనీలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

డబ్బులు, పందెంపై సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వాల నిషేధ చట్టాలను కొట్టివేస్తూ మద్రాస్, కర్ణాటక హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు సమర్థించింది. రాజ్యాంగం ప్రకారం బెట్టింగ్, జూదం అంశాలపై చట్టాలు చేసే సర్వాధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయని స్పష్టం చేసింది. ఆట ఆడటానికి నైపుణ్యం అవసరమైనప్పటికీ, దానిపై డబ్బుల పందేలు కాస్తే అది జూదం కిందకే వస్తుందని న్యాయస్థానం తీర్పునిచ్చింది.

సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి...

ఆన్‌లైన్ వ్యసనాల వల్ల యువత అప్పులపాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సమాజహితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడం సరైనదేనని న్యాయస్థానం సమర్థించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం నుంచి ఈ చరిత్రాత్మక తీర్పు వెలువడింది.



# కర్ణాటక సీఎంగా డీకే



**బెంగళూరు, మహా :** కర్ణాటక రాష్ట్రానికి 25వ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డీకే శివకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తన చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణ స్వీకారం చేయడం చాలా ప్రత్యేకంగా నిలిచింది. బుధవారం సాయంత్రం సరిగ్గా 4.10 గంటలకు బెంగళూరులోని లోక్‌భవన్‌లో ఉన్న ప్రతిష్టాత్మకమైన గ్లాస్ హౌస్ ప్రమాణ స్వీకారానికి వేదికైంది. కర్ణాటక గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, డీకే శివకుమార్ చేత పదవీ ప్రమాణం చేయించారు. 71 ఏళ్ల శివకుమార్, తన చిరకాల కోరిక అయిన ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. గత నెల మే 28వ తేదీన సిద్ద రామయ్య తన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో, ఒప్పందం ప్రకారం శివకుమార్‌కు మార్గం సుగమమైంది. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన శివకుమార్ సమర్థతకు దక్కిన గుర్తింపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**కేబినెట్‌లో చోటు దక్కించుకున్న వారు వీరే**

శివకుమార్‌తోపాటు పాలనలో అనుభవం ఉన్న జీ పరమేశ్వరన్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరిద్దరితోపాటు ఎమ్మెల్యేలు, మంత్రులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ జాబితాలో సామాజిక సమీకరణాలు వారసత్వ ప్రాధాన్యతలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర కూడా మంత్రిగా ప్రమాణం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే కూడా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. వీరితోపాటు కేహెచ్ మునిపయ్య, కేజే జార్జ్, రామలింగారెడ్డి, ఎంపీ పాటిల్ వంటి సీనియర్ నేతలంతా శివకుమార్ కేబినెట్‌లో ఉన్నారు. కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరి గౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌కు మంత్రి పదవులు దక్కాయి.

**రాజ్యాంగం చేతబూని ప్రమాణం**

ప్రమాణ స్వీకార సమయంలో శివకుమార్ భారత రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకోవడం చర్చనీయాంశమైంది. చాలా కాలంగా కాంగ్రెస్ రాజ్యాంగ ప్రతిని పట్టుకొని ప్రజల్లోకి వెళ్లోంది. మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. రాజ్యాంగబద్ధంగా పాలన సాగించాలని డిమాండ్ చేస్తోంది. రాహుల్ గాంధీతోపాటు ఆ పార్టీ నేతలు పెట్టిన ప్రెస్‌మీట్‌లో దీని హైలైట్ చేస్తున్నారు. ఇప్పుడు శివకుమార్ కూడా దాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారు. ఆయన ఏకంగా రాజ్యాంగ ప్రతిని పట్టుకొని ప్రమాణ స్వీకారం చేయడం చర్చకు దారితీసింది. ఈ ప్రమాణ స్వీకారానికి జాతీయ స్థాయి నేతలు తరలివచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర సీనియర్ నేతలు వచ్చి శివకుమార్‌కు శుభాకాంక్షలు చెప్పారు. పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్న సిద్ధరామయ్య కూడా ప్రమాణ స్వీకారానికి వచ్చి శివకుమార్‌ను ఆలింగనం చేసుకొని అభినందించారు.

**ట్రబుల్ షూటర్ నుంచి ముఖ్యమంత్రి వరకు**

డీకే శివకుమార్ రాజకీయ ప్రస్థానం ఎందరికో స్ఫూర్తిదాయం. క్లిష్ట సమయాల్లో పార్టీని ఆదుకోవడంలో సంక్షోభాలను చక్కదిద్దడంలో ఆయన దిట్ట. అందుకే ఆయనను ట్రబుల్ షూటర్ అంటారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంలో ఆయన వ్యూహరచన కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు నేరుగా పాలన బాధ్యతలు చేపట్టడం ద్వారా తన కార్యదక్షతను నిరూపించుకోవడానికి అవకాశం దక్కింది.



## కాంగ్రెస్‌కు విజయ్ గిఫ్ట్

**తమిళనాడు రాజ్యసభ సీటు కేటాయింపు**

**చెన్నై, మహా :** తనను సీఎంగా చేసేందుకు తొలిమద్దతు ఇచ్చి రాజకీయం టర్న్ చేసిన కాంగ్రెస్ పార్టీకి విజయ్ మరో గిఫ్ట్ ఇచ్చారు. ఇప్పటికే 59 ఏళ్ళ తర్వాత తొలిసారి రాష్ట్రమంత్రివర్గంలో కాంగ్రెస్ స్థానం ఇవ్వగా, ఇపుడు విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం కాంగ్రెస్‌కు రాజ్యసభ స్థానం కేటాయించింది. తమిళనాడు నుంచి రాజ్యసభ స్థానానికి జూన్ 18న ఎన్నిక జరుగనుంది. కాంగ్రెస్‌కు రాజ్యసభ సీటును కేటాయించిన విషయాన్ని ముఖ్యమంత్రి విజయ్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 'ఈనెల 18న తమిళనాడులో రాజ్యసభకు ఎన్నిక జరుగనుంది. ఆ రాజ్యసభ సీటును మా భాగస్వామ్య పార్టీ అయిన కాంగ్రెస్‌కు కేటాయించాలని టీవీకే నిర్ణయం తీసుకుంది' అని విజయ్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాష్ట్ర మాజీ మంత్రి సీవీ షణ్ముగం తన రాజ్యసభ స్థానానికి మే 7న రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి ఎన్నిక జరుగుతోంది



## బెంగళూరులో.. తెలంగాణ నేతల హవా

**డీకేతో రేవంత్ ఆత్మీయ ఆలింగనం**

బెంగళూరు, మహా : కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేయగా, ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, మాజీ సీఎం సిద్దరామయ్యతో పాటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తెలంగాణ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు హాజరయ్యారు. కాగా, ప్రమాణస్వీకారానికి ముందు డీకే శివకుమార్ రేవంత్ రెడ్డిని ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డీకే శివకుమార్‌ను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, ముఖ్యనేతలు బెంగళూరు వెళ్ళి ఆత్మీయవేడుకలో పాల్గొన్నారు. డీకే ప్రమాణస్వీకార కార్యక్రమంతో కర్నాటకలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినట్లుగా హడావుడి నెలకొంది.



## ఏనుమాముల మార్కెట్ చైర్ పర్సన్‌గా
# యార్ర ప్రియాంక

**మహా వరంగల్ బ్యూరో :** ఎట్టకేలకు మూడేండ్ల తర్వాత ఆసియా ఖండంలోనే అతిపెద్ద మార్కెట్ అయిన వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో కొత్త పాలకవర్గం కొలువు తీరింది కొలువు దీరింది. బుధవారం ఏనుమాముల మార్కెట్ చైర్పర్సన్ గా యార్ర ప్రియాంక తో పాటు వైస్ చైర్మన్ బండి జనార్ధన్, కొందరు సభ్యులతో కలిసి ఆమె మార్కెట్ కు చేరుకున్నారు. ఉత్తర్వుల కాపీని ఇన్చార్జ్ కార్యదర్శి అయిన మల్లేశానికి అప్పగించారు. అనంతరం రిజిస్టర్ లో సంతకం చేసి పదవీ బాధ్యతలను లాంఛనంగా స్వీకరించారు. ఆసియా ఖండంలోనే రెండో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ కు తనను చైర్పర్సన్ గా నియమించిన పార్టీ పెద్దలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

యార్ర ప్రియాంక కు చైర్పర్సన్ పదవి దక్కడంలో ఆమె భర్త అనిల్ కీలకపాత్ర పోషించినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా రాహుల్ గాంధీకి అనువాదకుడిగా పనిచేసిన అనిల్ పైరవీయే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఏడాదిన్నర క్రితమే ప్రియాంక చైర్పర్సన్ గా పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ స్థానిక రాజకీయాల నేపథ్యంలో అప్పట్లో కమిటీ నియామకం వాయిదా పడిందని తిరిగి ఒక్కరి పేరు మార్పుతో పాత కమిటీనే ప్రభుత్వం తాజాగా ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం చైర్పర్సన్ ప్రియాంక మాట్లాడుతూ తాను రైతు బిడ్డను కాకపోయినా రైతుల సమస్యలను పూర్తిగా తెలుసుకుంటానని, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

**కొత్త పాలకవర్గం ముందు పాత సవాళ్లు**

వరంగల్ ఏనుమాముల మార్కెట్ కు దాదాపు మూడేళ్లుగా పాలకవర్గం లేక పోవడంతో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో విచ్చలవిడిగా అవినీతి, అక్రమాలు రాజ్య మేలు తున్నాయని అనేక ఆరోపణలు గత కొంతకాలంగా వినబడుతున్నాయి. గత పాలకవర్గం కాలపరిమితి 2023 ఆగస్టు 16న ముగియడంతో అప్పటి నుంచి మార్కెట్ వ్యవహారాలు అధికారుల చేతుల మీదుగా సాగుతున్నాయి. పాలకవర్గం లేకపోవడంతో మార్కెట్ అభివృద్ధి కుంటుపడిందనే విమర్శలు ఉన్నాయి. మార్కెట్ లో జీరోదందా విచ్చలవిడిగా జరుగుతోందని, సూపర్వైజర్లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే అపవాదులు లేకపోలేదు. యార్డుల నిర్వహణ లోపాలు, రైతులకు అరకొర సౌకర్యాలు కొత్త పాలకవర్గానికి పాత సమస్యలే సవాల్‌గా మారనున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా నిలిచిన మార్కెట్ పనులు పండ్ల మార్కెట్ లేకపోవడంతో మార్కెట్ ఆదాయానికి భారీగానే గండి పడుతోంది. పాత గ్రెయిన్ మార్కెట్ లో అసంపూర్తిగా మిగిలిన మోడల్ మార్కెట్ నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. ఆ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం వరంగల్ బల్దియా ఆధీనంలోనే ఉంది. కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించకపోవడం తో నిర్మాణ పనులు రెండేళ్లుగా నిలిచిపోయాయి. లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్ లోనూ అడుగడుగునా సమస్యలు ప్రత్యక్ష మవుతున్నాయి. లక్షల రూపాయల మార్కెట్ ఫీజులు పెండింగ్ లో ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా బినామీల ఏరివేత కోసం ఐడీ కార్డులు జారీ చేస్తామన్న హామీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చడం లేదు. ఇవన్నీ సవాళ్లను అధిగమిస్తూ వీటి పై కొత్త పాలకవర్గం ఎలా దృష్టిసారిస్తుందో వేచి చూడాల్సిందే.



## బెల్లంపల్లి పట్టణానికి గోదావరి నుంచి త్వరగా మంచినీటిని అందించాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య (మున్సిపల్_అడ్మిన్)**

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి గోదావరి నీటిని అందించే ప్రక్రియలు వేగవంతం చేసి త్వరగా అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చంద్రయ్య ఆదేశించారు.బుధవారం నాడు బెల్లంపల్లి పట్టణానికి క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం _వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాతి రమేష్ బాబు తో పాటు పరిశీలించారు.ఈ సందర్భంగా... బెల్లంపల్లి పట్టణానికి గోదావరి నుంచి మంచినీటిని అందించాలని ప్రయత్నంలో భాగంగా చేపట్టిన అమృత్ 2.0 పనులను పరిశీలించి పనులు నత్త నడకన సాగడంతో త్వరగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను తో పాటు కాంట్రాక్టర్ ను ఆదేశించారు.పట్టణ డంపింగ్ యార్డ్ ను పరిశీలించడం జరిగింది.. ఈ సందర్భంగా డంపింగ్ యార్డ్ సమస్యను అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, డంపింగ్ యార్డ్ ఏర్పాటు కొరకు రెండు స్థలాలను పరిశీలించడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూలు నిర్మాణం కొరకై పట్టణంలో స్కూల్ నిర్మించే ప్రదేశంలో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నుంచి అనుమతులకు సంబంధించి సమస్య ఉందని తెలుపగా సంబంధిత అధికారులతో అడిషనల్ కలెక్టర్ మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది డం జరిగింది. పట్టణంలోని ప్రధాన రహదారిని ఆనుకొని నిర్మించిన అక్రమ షెడ్లను తొలగించాలని, పార్కింగ్ కు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.రోడ్లపై వ్యాపారాలు చేసుకుంటున్నా చిరు వ్యాపారులకు ప్రత్యమ్నాయ స్థలాలు చూపిస్తామని హామీ ఇచ్చారు.పట్టణంలోనికి ఇండ్లకు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో ఏదైనా అత్యవసర పరిస్థితులలో ప్రజలు తమకు చెందిన ఇంటిని కాని స్థలాన్ని కానీ తనాఖా పెట్టాలన్నా, విక్రాయించాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నారని కాబట్టి వెంటనే బెల్లంపల్లి పట్టణంలోని ఇళ్లకు, స్థలాలకు రిజిస్ట్రేషన్లు అయ్యేలా చూడాలని అడిషనల్ కలెక్టర్కు బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్, స్థానిక కౌన్సిలర్లు వినతి పత్రం అందజేశారు.అనంతరం పట్టణంలోని పలు బస్తీలలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సంబంధిత లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ పలువురు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ మా భూమి పుత్రుల జాగీరే

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారాన్ని రేపుతున్నాయి. "తెలంగాణ ఏమైనా మీ అయ్య జాగీరా?" అంటూ పవన్ కల్యాణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పవన్ అహంకారపూరిత వ్యాఖ్యలకు తనదైన శైలిలో దీటైన కౌంటర్ ఇచ్చారు. అవును.. తెలంగాణ కచ్చితంగా ఈ భూమి పుత్రుల జాగీరేనని కేటీఆర్ కుండబద్దలు కొట్టారు. దశాబ్దాల పాటు ఈ నేల కోసం అలుపెరగని పోరాటాలు చేసినవాళ్లు, తమ ప్రాణాలను త్యాగాలు చేసినవాళ్లు, ఉద్యమంలో రక్తం చిందించిన అమరవీరులది ఈ తెలంగాణ అని ఆయన స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ లాంటి వారు ఇక్కడ స్వేచ్ఛగా ఉండొచ్చని, వ్యాపారాలు చేసుకోవచ్చని, తమ కుటుంబాలతో ప్రశాంతంగా జీవించవచ్చని.. ఇందుకు ఎవరూ అడ్డుచెప్పలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, ఏకంగా వచ్చి మా సచివాలయంలో కూర్చొని పెత్తనం చేస్తాం, మాపై ఆధిపత్యం చెలాయిస్తామంటే మాత్రం ఇక్కడి ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోరని తేల్చిచెప్పారు. ప్రాంతీయ భావోద్వేగాలపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఒక ప్రాంతంపై ఉన్న ప్రేమను ప్రాంతీయ విద్వేషంగా వక్రీకరించడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. నాడు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన చారిత్రక ఉద్యమం కూడా ప్రాంతీయ భావమే అవుతుందా అని పవన్‌కు కేటీఆర్ సూటి ప్రశ్న సంధించారు. అదేవిధంగా, దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాలను పక్కనబెట్టి కేవలం గుజరాత్‌కు మాత్రమే అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రాజెక్టులు తరలించుకుపోతున్నారని ఆరోపించారు. మోదీ అనుసరిస్తున్న ఈ విధానం 'ఆర్థిక ప్రాంతీయ భావం' కాదా అని నిలదీశారు. తెలంగాణ గడ్డకు దేశభక్తి గురించి ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని, నిజాం నిరంకుశ పాలనపై వీరోచిత పోరాటాలు చేసి స్వేచ్ఛను శ్వాసించిన నెత్తుటి నేల ఇదని కేటీఆర్ ఉద్ఘాటించారు.




ఒక నటుడిగా పవన్ కల్యాణ్‌ను తెలంగాణ ప్రజలు ఎప్పుడూ అభిమానిస్తారని, ఆదరిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన తమ ఇంటికి వస్తే ఎంతో ఆప్యాయంగా పసందైన హైదరాబాదీ బిర్యానీ పెట్టి పంపుతామని, కానీ తెలంగాణ రాజకీయాలపై పెత్తనం చేస్తామంటే మాత్రం సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా, ఎక్కడైనా రాజకీయ పార్టీ పెట్టుకునే హక్కు ఉందని.. అలాగే తెలంగాణలో కూడా జనసేన పోటీ చేసుకోవచ్చని కేటీఆర్ స్పష్టం చేశారు. అయితే, పార్టీ నడిపే ముందు ఇక్కడి ప్రజల భావోద్వేగాలు, వారు చేసిన త్యాగాల చరిత్రను పూర్తిగా తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని పవన్‌కు హితవు పలికారు. తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడే అసలైన, ఏకైక నాయకుడు తమ పార్టీ అధినేత కేసీఆర్ గారేనని కేటీఆర్ ఈ సందర్భంగా సగర్వంగా ప్రకటించారు

# దమ్ముంటే డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేసి రా.

- **జనసేన కనుమరుగవుతుందేమో కానీ కమ్యూనిజం చావదు.**
- **ఆంధ్ర, తెలంగాణ అంటూ మళ్లీ పనికిమాలిన రాద్ధాంతం ఎందుకు?**
- **పవన్‌కు ఆవేశం తప్ప రాజకీయం ఏమీ తెలియదంటూ తీవ్రస్థాయిలో ధ్వజం.**
- **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.**

**హైదరాబాద్, మహా :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన తాజా వ్యాఖ్యలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణపై, కమ్యూనిజంపై పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలు ఎంతో బాధాకరమని పేర్కొంటూ ఆయనపై ప్రశ్నల వర్షం కురిపించారు. అపరిచితుడిలా వస్తా, ఇక్కడే తిరుగుతా అని పవన్ ప్రగల్భాలు పలకడం విడ్డూరంగా ఉందని, ఇక్కడ తిరిగేందుకు ఆయనను ఎవరొద్దన్నారని సూటిగా ప్రశ్నించారు. దమ్ముంటే ఏపీ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేసి ఇక్కడే ఉండాలని సవాల్ విసిరారు. పవన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం లేదా ఇంకెవరి ప్రయోజనాల కోసమో మళ్లీ ఆంధ్రా, తెలంగాణ అంటూ పనికిమాలిన రాద్ధాంతం సృష్టిస్తున్నారని మండిపడ్డారు. పవిత్రమైన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే ఇక్కడికి వచ్చి కవ్వింపు చర్యలకు పాల్పడటం, సవాళ్లు విసరడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని నిలదీశారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నిజమైన అపరిచితుడు ఎవరైనా ఉన్నారంటే అది కచ్చితంగా పవన్ కల్యాణే అని కూనంనేని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్రాంతీయవాదం మరింత పెరిగే ప్రమాదం ఉందని, తెలంగాణలో ఆయనకు వచ్చిన పూనకం ఏంటో అర్థం కావడం లేదన్నారు.

కమ్యూనిస్టుల మీద, కమ్యూనిజం మీద పవన్ చేసిన వ్యాఖ్యలను కూనంనేని తీవ్రంగా ఖండించారు. తాను, తన తండ్రి కమ్యూనిస్టులమని గతంలో పదేపదే చెప్పుకున్న పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఆ కమ్యూనిజం ఏమైపోయిందని ప్రశ్నించారు. ఒకప్పుడు కమ్యూనిస్టు జెండా మోసిన ఆయన, నేడు కమ్యూనిజం చచ్చిపోయిందని మాట్లాడటం ఆయన అమాయకత్వానికి, రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. కమ్యూనిజం చచ్చిపోయిందని పవన్‌కు ఎవరు చెప్పారని, రాబోయే రోజుల్లో జనసేన పార్టీ కనుమరుగవుతుందేమో కానీ, కమ్యూనిజం ఎన్నటికీ చచ్చిపోదని ఆయన తేల్చిచెప్పారు. కమ్యూనిస్టులైన తాము ఎల్లప్పుడూ ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తాం తప్ప, డిప్యూటీ సీఎం పదవుల కోసం పాకులాడబోమని చురకలంటించారు. 'ప్రపంచ కార్మికులారా విడిపోండి' అని తామెప్పుడూ చెప్పలేదని పవన్‌కు కౌంటర్ ఇచ్చారు. సనాతన ధర్మాన్ని ఎవరైనా అవమానిస్తే సంగతి చూస్తానని పవన్ హెచ్చరిస్తున్నారని, అసలు సనాతన ధర్మాన్ని ఇక్కడ ఎవరు అవమానించారని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ మీద ఏమాత్రం ప్రేమ లేదు కాబట్టే పవన్ నాడు రాష్ట్ర విభజనను సైతం తప్పుబట్టారని విమర్శించారు.

ప్రముఖ విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ మీద పవన్ చేసిన వ్యాఖ్యలను సైతం కూనంనేని తప్పుబట్టారు. గత 40 ఏళ్లలో ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎన్నడూ మాట తూలలేదని, ఒకవేళ పొరపాటున మాట్లాడినా వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు. ఆ విషయం అక్కడితో ముగిసినప్పటికీ పవన్ కల్యాణ్ ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని ప్రశ్నించారు. వస్తా.. చూస్తా.. అంటున్న పవన్ కల్యాణ్ ఇక్కడికి వచ్చి ఏమీ చూస్తారని నిలదీశారు. పవన్ కల్యాణ్‌కు ఒక స్థిరమైన సిద్ధాంతం, ఓపిక లేవని, ఆవేశం తప్ప ఆయనకు రాజకీయం ఏమీ తెలియదని కూనంనేని వ్యాఖ్యానించారు. తెలంగాణకు రావొద్దని పవన్‌ను ఎవరూ అడ్డుకోలేదని, అలాంటప్పుడు ప్రజా యుద్ధ నౌక గద్దర్‌కు తాను కారు ఇచ్చినట్లు గొప్పలు చెప్పుకోవడం అవసరమా అని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా, దేశంలో పెరిగిపోతున్న నిత్యావసరాలు, అధిక ధరలకు వ్యతిరేకంగా ఈ నెల 10వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటం చేయనున్నట్లు కూనంనేని సాంబశివరావు ఈ మీడియా సమావేశంలో వెల్లడించారు.

### మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి సిట్ నోటీసులు

**హైదరాబాద్ సిటీ, మహా** : ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది. గురువారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరుకావాలని పేర్కొంది. 201418 మధ్య మహేశ్వరం ఎమ్మెల్యేగా తీగల కృష్ణారెడ్డి పని చేశారు.

### 350 మంది డిపెండెంట్ లకు ఉద్యోగాలు ఇవ్వాలి

**మందమర్రి, మహా :** సింగరేణి వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 350 మంది డిపెండెంట్ లకు ఉద్యోగాలు ఇవ్వాలని సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటియుసి) మందమర్రి బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఉపాధ్యక్షులు భీమనాథుని సుదర్శన్, ఇప్పకాయల లింగయ్య, తిరుపతి గౌడ్, కంది శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. బుధవారం మందమర్రి జిఎం కార్యాలయం ముందర ఏఐటియుసి ర్యాలీ, ధర్నా లు నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల కార్మికులు మెడికల్ అన్ఫిట్ పూర్తయిపోయి 350 మంది కారుణ్య నియామకాలు ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందవలసి ఉండగా యాజమాన్యం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ బోర్డు నిర్వహించవలసి ఉండగా అది అతి గతి లేదని మండి పడ్డారు.

పాత పద్ధతి ప్రకారంగానే మెడికల్ బోర్డు నిర్వహించాలని వారు కోరారు. పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ యాజమాన్యమే చెల్లించాలని అన్నారు. కార్మికుని సొంతింటి కల సహకారం చేయాలని స్పష్టం చేశారు.

యాజమాన్యం, సింగరేణి గుర్తింపు సంఘంతో స్ట్రక్చర్ సమావేశాలలో అమలు చేస్తానని ఇచ్చిన హామీలను కంపెనీ అమలు చేయడం లేదని వారు దుయ్యబట్టారు. తమ సంఘం సమస్యల గురించి నిగ్గదీస్తున్నప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం చోద్యం చేస్తుందని వెల్లడించారు.

కొన్ని సర్కార్ సంఘాలు కుట్రలతో ఈ సమస్యలను పరిష్కరించకుండా యాజమాన్యానికి ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ కార్మికులకు ద్రోహం తలపెడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ సంఘం ఐఎన్టియుసి నేతలు గనుల పైకి వస్తే కార్మికులు వారిని నిలదీయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ ఎండి అక్బర్ అలీ, పెద్దపల్లి బానాయ్య, ఎగ్గెటి రాజేశ్వరరావు, సివి రమణ,

పిట్ కార్యదర్శిలు గాండ్ల సంపత్ , మర్రి కుమారస్వామి, సిహెచ్ పి శర్మ, హరి రామకృష్ణ, తదితరులు కార్మికులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్ కు అందజేశారు.

## కర్నాటకం ముగిసింది..
# ఇక తెలంగాణపై కాంగ్రెస్ఫోకస్!

( మొదటి పేజీ తరువాయి )

సతీషన్, తమిళనాడులో విజయ్ లు కాంగ్రెస్ కు నాలు గుస్తంభాల్లా నిలిచారు.

**జూన్ ఆఖర్లో 'ఢిల్లీ' యాక్షన్ ప్లాన్:**

కర్నాటక ప్రక్రియ ముగియడంతో, జూన్ చివరి వారం నుంచి తెలంగాణ రాజకీయాలపై ఎఐసిసి పెద్దలు నేరుగా దృష్టి సారించనున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత పటిష్టం చేయడం, అదే సమయంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని క్షేత్రస్థాయి వరకు బలోపేతం చేయడంపై అధిష్టానం కసరత్తు ప్రారంభించనుంది. తెలంగాణలో పార్టీ మరియు ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని పెంచుతూ, పాలనలో వేగాన్ని పెంచేలా జూన్ ఆఖరున ఢిల్లీ వేదికగా కీలక సమావేశాలు జరగనున్నాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో పెండింగ్‌లో ఉన్న కీలక మార్పులు, చేర్పుల ప్రక్రియ అంతా రాబోయే ఒకటి లేదా రెండు నెలల వ్యవధిలోనే సంపూర్ణంగా కొలిక్కి రానుంది. ఆగస్టు నాటికి పార్టీని, ప్రభుత్వాన్ని సరికొత్త శోభతో, మరింత దూకుడుతో ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది అధిష్టానం ఆలోచన. ఈ లోపే అంతర్గత అసంతృప్తులకు తావులేకుండా, సామాజిక సమీకరణాలను బేరీజు వేస్తూ తుది నిర్ణయాలు తీసుకోనున్నారు.

**త్వరలో మంత్రివర్గ ప్రక్షాళన**

రాష్ట్రంలో పాలనకు మరింత ఊపు తీసుకురావడానికి మరియు ప్రజల్లో ప్రభుత్వ గ్రాఫ్‌ను మరింత పెంచడానికి త్వరలోనే 'మంత్రివర్గ ప్రక్షాళన మరియు విస్తరణ' చేపట్టనున్నారు. పనితీరు ఆధారంగా మంత్రుల శాఖల్లో మార్పులు చేర్పులు ఉండే అవకాశం ఉంది. ఖాళీగా ఉన్న క్యాబినెట్ బెర్తులను భర్తీ చేయడంతో పాటు, ఆయా జిల్లాల్లో సామాజిక సమతుల్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు. సమర్థులైన నేతలకు కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా పాలనను మరింత ప్రజలకు చేరువ చేయాలనేది ముఖ్యమంత్రి ఏవంత్ రెడ్డి, హైకమాండ్ ఉమ్మడి వ్యూహంగా ఉంది. ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ మార్క్ కేబినెట్, పార్టీ పదవుల భర్తీ జరగనుంది.



**వర్కింగ్ ప్రెసిడెంట్లు, కీలక పదవుల భర్తీ**

ప్రభుత్వంతో పాటు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని కూడా ప్రక్షాళన చేయనున్నారు. పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులను భర్తీ చేయనున్నారు. పార్టీ కోసం కష్టపడిన సీనియర్లకు, యువ రక్తం కలిగిన ఉత్సాహవంతులకు ఈ పదవుల్లో ప్రాధాన్యత దక్కనుంది. నామినేటెడ్ పదవుల భర్తీ కూడా ఇదే వ్యవధిలో పూర్తి చేసి, ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేయనున్నారు.పలు జిల్లాల సమీకరణల్లో మార్పులు జరగనున్నాయి. ఇటీవల కాలంలో పలువురు ఎమ్మెల్యేలు నేరుగా వెళ్ళి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, అధ్యక్షుడు ఖర్గే ను కలిసివస్తున్నారు.

**తమిళనాడు, కేరళ ఫలితాల ఉత్సాహం**

దక్షిణాదిలో కాంగ్రెస్‌కు తిరుగులేదనే సంకేతాన్ని తమిళనాడు, కేరళ ఫలితాలు స్పష్టం చేశాయి. తమిళనాడులో డిఎంకె కూటమితో కలిసి సాధించిన ఘన విజయం, కేరళలో కాంగ్రెస్ సంప్రదాయ ఓటు బ్యాంకు పటిష్టంగా ఉందనే నిరూపణ హస్తం శ్రేణులకు బూస్టర్ డోస్‌లా పనిచేసింది. ఈ ఉత్సాహాన్ని కేవలం ఎన్నికల విజయాలకే పరిమితం చేయకుండా, సుస్థిర రాజకీయ శక్తిగా మారేందుకు తెలంగాణను మోడల్ స్టేట్‌గా మార్చాలని హైకమాండ్ భావిస్తోంది. కర్నాటకలో పరిణామాలు అత్యంత సాఫీగా, వివాదరహితంగా ముగియడంపై అధిష్టానం అత్యంత సంతోషంగా ఉంది. డీకే శివకుమార్ సీఎంగా ప్రమాణస్వీకారం చేయగా, సిద్ధరామయ్య సహకరించారు. అక్కడ నెలకొన్న రాజకీయ పరిణితిని తెలంగాణలోనూ పునరావృతం చేస్తూ, నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు రాకుండా ఏకతాటిపైకి తీసుకురావడంలో ఎఐసిసి సఫలీకృతమైంది.

**2029 లక్ష్యంగా తెలంగాణపై గురి**

కాంగ్రెస్ పార్టీ తక్షణ లక్ష్యం కేవలం వర్తమాన రాజకీయాలు మాత్రమే కాదు.. 2029లో కేంద్రంలో అధికారమే పరమావధి. అందుకోసం తెలంగాణను కాంగ్రెస్‌కు బలమైన దుర్గంగా మార్చాలని గురి పెట్టింది. తెలంగాణలో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోనూ పార్టీ పునరుజ్జీవనానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఏపీలో కూడా క్రమంగా ఓటు బ్యాంకును పెంచుకుంటూ, పూర్వవైభవం తెచ్చేలా ప్రత్యేక ఫోకస్ పెట్టనున్నారు.

**సౌత్‌లో 90 శాతం స్థానాలపై కన్ను**

దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాలు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ) మరియు పుదుచ్చేరిలలో కలిపి మొత్తం ఉన్న లోక్‌సభ స్థానాల్లో కనీసం 90 శాతం సీట్లను కాంగ్రెస్ మరియు దాని కూటమి ఖాతాలో వేసుకోవడమే లక్ష్యంగా 'మిషన్ 90%' వ్యూహాన్ని రచిస్తున్నారు. ఉత్తరాది కంటే దక్షిణాదిలోనే కాంగ్రెస్ హవా బలంగా ఉండటంతో, ఇక్కడి నుంచే ఢిల్లీ పీఠాన్ని కదిలించేలా పునాదులు వేస్తున్నారు. అందులో భాగంగానే తెలంగాణను ఈ వ్యూహానికి ప్రధాన కేంద్ర బిందువుగా మార్చబోతున్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో మార్పులు ఖాయంగా కనబడుతున్నాయి.

# చైనా వలలో కజకిస్థాన్



మధ్య ఆసియా లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన కజకిస్థాన్, చైనాతో ఆర్థిక బంధంలో ఒక కొత్త అధ్యాయానికి తెరలేపింది. డాలర్ ఆధిపత్యానికి గండి కొట్టాలని చూస్తున్న చైనాకు, రష్యాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్న కజకిస్థాన్‌కు మధ్య కుదిరిన ఈ 'యువాన్' బంధం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల కజకిస్థాన్ ప్రభుత్వం చైనా దేశీయ మార్కెట్ నుండి 3.4 బిలియన్ల యువాన్ల (సుమారు 500 మిలియన్ డాలర్లు) సోవేరియన్ బాండ్లను కేవలం 1.9 శాతం వడ్డీకే, మూడేళ్ల కాలపరిమితితో జారీ చేసింది. అయితే, ఈ అప్పుల ప్రయాణం ఇప్పుడే మొదలైంది కాదు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలలో, ఆర్థిక వ్యూహాలలో శాశ్వత శత్రుత్వాలు కానీ, శాశ్వత మిత్రత్వాలు కానీ ఉండవు; కేవలం దేశ ప్రయోజనాలు మాత్రమే పరమావధిగా ఉంటాయి. దీనికి నిదర్శనంగా, మధ్య ఆసియాలో అత్యంత సంపన్నమైన, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన కజకిస్థాన్, చైనాతో తన ఆర్థిక బంధాన్ని సరికొత్త మైలురాయికి తీసుకెళ్లింది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నీడ, సాంప్రదాయ భాగస్వామి అయిన రష్యా కరెన్సీ అస్థిరత నేపథ్యంలో, కజకిస్థాన్ చైనా దేశీయ మార్కెట్ల నుంచి 'యువాన్' రూపంలో భారీగా రుణాలు సేకరించడం ప్రారంభించింది. ఇటీవల కజకిస్థాన్ ప్రభుత్వం 3.4 బిలియన్ల యువాన్ల (సుమారు 500 మిలియన్ డాలర్లు) సోవేరియన్ బాండ్లను కేవలం 1.9 శాతం వడ్డీకే జారీ చేయడం అంతర్జాతీయ ఆర్థిక వర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది. కజకిస్థాన్ ప్రభుత్వం నేరుగా చైనా నుండి సోవేరియన్ బాండ్ల ద్వారా అప్పులు తీసుకోక ముందే, ఆ దేశానికి చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు చైనా మార్కెట్‌ను చురుగ్గా వాడుకున్నాయి. ఈ నిధుల సేకరణ ప్రక్రియ ఒక ప్రణాళికాబద్ధమైన క్రమంలో సాగింది:

**అప్పుల లెక్కల పునాది**

ప్రభుత్వం నేరుగా రంగంలోకి దిగడానికి ముందే, కజకిస్థాన్ ప్రభుత్వ రంగ సంస్థలు చైనా మార్కెట్ నుండి భారీగా నిధులు సేకరించాయి:

డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ కజకిస్థాన్: సెప్టెంబర్ 2025లో 2 బిలియన్ యువాన్ల యూరో బాండ్లను జారీ చేసింది. మధ్య ఆసియాలోనే చైనా కరెన్సీలో బాండ్లు జారీ చేసిన తొలి బ్యాంక్‌గా ఇది రికార్డు సృష్టించింది. ప్రస్తుత ప్రభుత్వ రుణంతో కలిపి చైనా మార్కెట్ నుండి కజకిస్థాన్ సేకరించిన మొత్తం అప్పు 9.65 బిలియన్ యువాన్లకు (రూ. 11,000 కోట్లకు పైగా) చేరింది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా కరెన్సీ 'రూబెల్' అంతర్జాతీయంగా తీవ్ర అస్థిరతకు లోనైంది. దాంతో రష్యాతో వ్యాపారం కజకిస్థాన్‌కు భారంగా మారింది. పోనీ, అమెరికా 'డాలర్' వైపు వెళ్దామంటే.. పాశ్చాత్య దేశాల ఆంక్షలు ఎప్పుడు ఎవరిపై పడతాయో తెలియని రిస్క్ ఉంది. ఈ నేపథ్యంలో కజకిస్థాన్‌కు చైనా 'యువాన్' సురక్షితమైన ప్రత్యామ్నాయంగా కనిపించింది. ఈ అప్పుగా తీసుకున్న సొమ్మును కజకిస్థాన్ మౌలిక సదుపాయాల కల్పన: రోడ్లు, రైల్వే నెట్‌వర్క్‌ల ఆధునీకరణ, చమురు, సహజవాయువు ప్లాంట్ల అప్‌గ్రేడేషన్ కు వినియోగించనుంది. కరెన్సీ మార్పిడి ఛార్జీలు తప్పడం, అతి తక్కువ వడ్డీకే రుణాలు రావడం ఒక ఎత్తయితే.. తమ దేశం మీదుగా వెళ్లే చైనా రవాణా మార్గాల నుండి 'ట్రాన్సిట్ ఛార్జీలు' వసూలు చేసి లాభాలు గడించవచ్చని కజకిస్థాన్ భావిస్తోంది.

**చైనా 'ఉదారత వ్యూహం అదే**

కేవలం 1.9% వడ్డీకే చైనా ఎందుకు అప్పులిస్తోంది? చైనా దాతృత్వం వెనుక అంతర్జాతీయ రాజకీయం మరియు దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉన్నాయి: బీఆర్ఐ ప్రాజెక్టుకు గుండెకాయ: చైనా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్' కు కజకిస్థాన్ భౌగోళికంగా అత్యంత కీలకం. చైనా నుండి యూరప్‌కు వెళ్లే వాణిజ్య మార్గానికి కజకిస్థాన్ ఒక వంతెన లాంటిది. ప్రపంచ మార్కెట్లో డాలర్ ఒంటెద్దు పోకడలకు అడ్డుకట్ట వేసి, యువాన్‌ను అంతర్జాతీయ కరెన్సీగా మార్చాలనేది చైనా ప్లాన్. కజకిస్థాన్ ఈ నిధులతో చేపట్టే రోడ్లు, రైల్వే ప్రాజెక్టులకు కావలసిన ముడిసరుకు, సాంకేతికత, యంత్రాలను తిరిగి చైనా నుంచే దిగుమతి చేసుకోవాలి. అంటే.. ఇచ్చిన అప్పు వడ్డీతో సహా చైనా కంపెనీలకే మళ్లీ చేరుతుంది. చైనాతో కజకిస్థాన్ ప్రారంభించిన ఈ కొత్త ఆర్థిక అధ్యాయం ఒక పక్క సముచితమైన ఆర్థిక ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నప్పటికీ, అది కత్తి మీద సాము లాంటిదే. డాలర్, రూబెల్ ల బెడద నుంచి తప్పించుకోవడానికి 'యువాన్' రక్షణ కవచాన్ని ఆశ్రయించిన కజకిస్థాన్, ఆ కవచమే రేపు తమను బంధించే సంకెళ్లు కాకుండా చూసుకోవాలి. అంతర్జాతీయ సంబంధాలలో అతిగా ఒకే దేశంపై ఆధారపడటం సార్వభౌమత్వానికే ప్రమాదం కాబట్టి, కజకిస్థాన్ తన దేశీయ ప్రయోజనాలను కాపాడుకుంటూనే, చైనా డ్రాగన్ 'డెట్ ట్రాప్' వ్యూహాలకు చిక్కకుండా అత్యంత సమతుల్యతతో, చాణక్యంతో ముందడుగు వేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.



# ఎందుకీ విద్వేషం

ఏమిటీ ఈ ద్వేషం... ఎందుకు ఈ విద్వేషం.... ఎప్పటికి ఆగుతాయి ఈ విమర్శలు... ఎప్పుడు ఆపుతారు ఈ ఆరోపణలు.. తెలంగాణ ఏర్పాటు అయి 12 సంవత్సరాలు అయినా ఇంకా ఆంధ్రా, తెలంగాణ వాదం మాత్రం సమసి పోవటం లేదు.. తెలంగాణ సాధన కోసం అమరులైన బిడ్డల త్యాగాలు ఇంకా కళ్ల ముందే నిలుస్తున్నాయి... తెలంగాణ ఉద్యమం ఓ స్ఫూర్తిదాయక ఘట్టం. ఇది అందరు ఒప్పుకుని తీరాల్సిందే... ఇప్పుడు కావాల్సింది ప్రాంతీయ వాదం ఎంత మాత్రం కాదు... వృద్ధి... అభివృద్ధి. ఇందులో ఇప్పుడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పోటీ పడాలి... ప్రగతి వైపు రాష్ట్రాలను పరుగులు తీయించి దేశంలోనే రెండు తెలుగు రాష్ట్రాలను అగ్రభాగానా నిలపాలి... ఈ విషయం పై రెండు రాష్ట్రాలు దృష్టి పెట్టాల్సిన వేళ ఇది.. అంతేకానీ మళ్ళీ ప్రాంతీయవాదం తెర పైకి తెచ్చి రాజకీయ లబ్ధికోసం ప్రాకులాటలు సాగిస్తే తెలుగుజాతి పేరు, ప్రతిష్టలు దిగజారే ప్రమాదం వుంది... ఈ విషయం ఇరు రాష్ట్రాల రాజకీయ నేతలకు తెలియనిది కాదు... అయినా రచ్చ చేయటం ఓ పనిగా పెట్టుకున్నారు... తెలంగాణ జనాల దిష్టి తగిలి కోనసీమ వెలవెలబోతోంది అంటూ ఒకరు, తెలంగాణలో ఆంధ్ర వారికీ చోటు లేదని మరొకరు... ఇలా మొదలు అవుతున్న వివాదాలు చివరికి ఎక్కడ వరకు వెడతాయి అనేది ఎవ్వరికి పట్టట్లేదు... అసలు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రాంతీయ వాదం ఇప్పుడు మళ్ళీ ఎందుకు తవ్వుతున్నారు అనేది కాస్త నిశితం గమనిస్తే అది కేవలం రాజకీయ స్వార్ధం కోసమే అన్న అసలు నిజం ప్రతీ ఒక్కరికి బోధ పడుతుంది... నిజానికి తెలంగాణలో వున్న ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, ఆంధ్రప్రదేశ్ లో వున్న. తెలంగాణ వాసులకు నూటికి నూరు శాతం ప్రాంతీయ వాదం లేదు... వారి మధ్య వున్నది స్నేహం, సన్నిహితం, బంధుత్వం మాత్రమే... తెలుగుజాతి మనది రెండుగా వెలుగు జాతి మనది అంటూ సీ. నారాయణ రెడ్డి అన్న పలుకులు ఇప్పుడు తెలుగు రాష్ట్రాలోని రాజకీయ పార్టీ నేతలు ఒకటికి వంద సార్లు నిత్యం పాడుకోవాల్సిందే... రాజకీయ మనుగడ కోసం, పార్టీల అస్తిత్వం కోసం ప్రాంతీయ వాదం రెచ్చగిట్టటం, అది తెలుగు రాష్ట్రాల ప్రజల మనోభిప్రాయంగా పార్టీల నేతలు చెప్పుకోవటం పరిపాటిగా మారింది... నిజానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నది అభివృద్ధి... ఉపాధి... విద్యా, వైద్యం... కూడు, గూడు... అంతే గాని ప్రాంతాల వారీగా విభేదాలు ఏ ఒక్కరు కోరుకోవడం లేదు అన్నది బహిరంగ రహస్యం..

ఇప్పుడు వివాదాలు తారా స్థాయికే చేరుకున్నాయి... అయ్యా జాగీరులను ప్రశ్నించుకునే స్థాయికి చేరుకున్నాయి... ఏ రాష్ట్రం ఏ పార్టీకి శాశ్వతం కాదు... ఇది ప్రజాస్వామ్య విధానం... తమకు ఎవరు పాలకులుగా ఉండాలో ప్రజలు ఓటు ద్వారా స్పష్టంగా చెప్పేసి అధికారం ఇస్తున్నారు... ఇక అలాటప్పుడు ఏ రాష్ట్రం ఎవరీ జాగీరు...? ఇది రాజకీయ నేతలకు తెలీదా? తెలుసు... తెలిసే ఈ నాటకాలు చేయటం, రక్తి కట్టించే దిశగా వాటిని లాగటం పార్టీ నేతలకు ఓ అలవాటుగా మారింది... తాజాగా సాగుతున్న ప్రాంతీయ వాదం కూడా ఇందులో భాగమే... రాజకీయ ప్రయోజనం కోసం ప్రాంతీయ వాదాన్ని ఆయుధంగా పెట్టటం ఇప్పుడు అత్యంత సులభంగా నేతలకు మారింది... ఇక దేశంలో ఎక్కడైనా జీవించే హక్కు, మాట్లాడే హక్కు, భావాలు వ్యక్తం చేసే హక్కు రాజ్యాంగం ఇచ్చింది... అందుకు పరిమితులు కూడా వున్నాయి...సభలు, సమావేశాలు... ర్యాలీలు... ధర్నాలు ఇలా వివిధ కార్యక్రమాలు చేసుకునేందుకు రాజకీయ పార్టీలకు ఓ విధానం వుంది... ప్రజలకు ఇబ్బంది లేని వాటిని గుర్తించి వాటి నిర్వహించడం కోసం పోలీసులు అనుమతి కూడా ఇస్తారు... అయితే ఆయా పార్టీలు, సంస్థలు, సంఘాలు ఏర్పాటు చేసే సమావేశాలు, సభలు ఇతరాల వల్ల శాంతి, భద్రతల సమస్య వచ్చే పరిస్థితి ఉంటే వాటిని అనుమతించక పోవటం సర్వ సాధారణ అంశం... ఇక ఇప్పుడు తెలంగాణలో జనసేన పార్టీ నవ తెలంగాణ నిర్మాణం అంటూ సభ ఏర్పాటు చేసే ఆలోచన మరోసారి ప్రాంతీయ వాదం వరకు వెళ్లి ఇప్పుడు ఇదే రొచ్చుగా మారింది... ఈ సభకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు... కోర్టు కూడా నో అనేసింది. ఈ వివాదం ఇక్కడితో ముగిసి పోతే ఇబ్బంది లేకుండా పోయేది... కానీ రెచ్చగొట్టుకునే వ్యాఖ్యలు, సవాళ్లు, విమర్శలు, ఆరోపణల వరకు చేరి ఇప్పుడు ఇరు రాష్ట్రాల ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి తీసుకొని వచ్చింది... ఇప్పటికి ఇప్పుడు కొంపలంటుకునే దుస్థితి లేక పోయినా ప్రజల ప్రశాంత జీవనం పైన ఇది ప్రభావం చూపేలా తయారు అవుతోంది... బతుకు తెరువు కోసం వచ్చిన వారికి ఇది సంకటమే అన్నది మేధావుల అభిప్రాయం... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే ప్రాంతీయ భావం దూరం అయింది అనుకుంటున్న ఇరు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఇప్పుడు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు చిరాకు పుట్టిస్తున్నాయి... ఇవి అభివృద్ధికి గొడ్డలి పెట్టులాంటివే అంటున్నారు వాళ్ళు... ఎవరి రాష్ట్రం పై వారికి అభిమానం ఉంటుంది... ఇది సహజం... దేశభక్తి అంటే ప్రాంతీయ వాదం కాదు... అదో గౌరవభావం... ఆత్మ నిబద్ధత... ఇది తెలిసి కూడా ప్రాంతీయ తత్వం పై రాజకీయం చేయటం అవివేకం. ప్రజలకు కావాల్సింది బతుకేందుకు ఓ మార్గం... అది చూపే దిశగా మాత్రమే నేతలు ప్రయత్నం చేస్తే అది శాశ్వత బలం అవుతుంది... అంతేకానీ ఎవరి జాగీరు కానీ వాటి కోసం రచ్చ చేసి రొచ్చు రాజకీయం నడిపితే చివరికు తగిన మూల్యం ప్రజల నుంచి అందుకోవాల్సి వస్తుంది... ప్రాంతీయ వాదన వదిలి సమతా వాదన వైపు ఇప్పుడు నేతలు అడుగు వేస్తే అదే తెలుగు రాష్ట్రాలకు పెన్నిధి అవుతుంది...



**జీ. వెంకటరమణ...**
సీనియర్ జర్నలిస్ట్

# మంచి నిద్ర కావాలంటే..?




చాలామంది నిద్ర కేవలం మెదడుకు సంబంధించిన ప్రక్రియ అని భావిస్తారు. అయితే ఆధునిక పరిశోధనల ప్రకారం, జీర్ణవ్యవస్థ నిద్రపై ఊహించని విధంగా ప్రభావం చూపుతుందని స్పష్టమవుతోంది. మీరు తీసుకునే ఆహారం పగటిపూట శక్తిని అందించడమే కాకుండా, రాత్రి వేళ ఎంత ప్రశాంతంగా నిద్రపోతారో కూడా నిర్ణయిస్తుంది. మెదడు మరియు జీర్ణవ్యవస్థ మధ్య జరిగే సంక్లిష్ట సంభాషణల ద్వారా మన శరీర గడియారం, మానసిక స్థితి మరియు రాత్రిపూట కోలుకునే ప్రక్రియ నియంత్రించబడతాయి. కాబట్టి సాయంత్రం వేళ తీసుకునే ఆహారం నిద్రపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

జీర్ణవ్యవస్థలో ఉండే కోట్ల కొద్దీ సూక్ష్మజీవులు జీర్ణక్రియను, రోగనిరోధక శక్తిని, హార్మోన్ల ఉత్పత్తిని క్రమబద్ధీకరిస్తాయి. కింగ్స్ కాలేజ్ లండన్ అధ్యయనం ప్రకారం, నిద్ర వేళల్లో చిన్న మార్పులు చేసినా జీర్ణక్రియలోని బ్యాక్టీరియాలో స్పష్టమైన తేడాలు కనిపిస్తాయి. నిద్ర సమయాల్లో తొంభై నిమిషాల వ్యత్యాసం కూడా జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవుల కూర్పుపై ప్రభావం చూపుతుంది. ఈ సూక్ష్మజీవులు వాపును, జీవక్రియను నియంత్రించే సమ్మేళనాలను ఉత్పత్తి చేస్తాయి.

ఈ సమతుల్యత దెబ్బతింటే నిద్రలో ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉంది. జీర్ణవ్యవస్థకు, నిద్రకు మధ్య ఉన్న సంబంధం రెండు వైపులా పనిచేస్తుంది. కొన్ని రకాల బ్యాక్టీరియాల హెచ్చుతగ్గులు నిద్ర కాలపరిమితిని మరియు నాణ్యతను ప్రభావితం చేస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి. క్రమబద్ధమైన నిద్ర ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థను కాపాడితే, సరైన ఆహారం ఆ జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది.

జీర్ణ వ్యవస్థను.. మీరు తీసుకునే ఆహారం జీర్ణ వ్యవస్థను నిర్ణయిస్తుంది. పరిశోధనల ప్రకారం, పీచు పదార్థాలు ఎక్కువగా ఉండే కూరగాయలు, తృణధాన్యాలు, పండ్లు తీసుకోవడం వల్ల మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇవి స్థిరమైన నిద్రకు తోడ్పడతాయి. ఆహారం తీసుకునే సమయాల్లో మరియు నిద్రపోయే వేళల్లో క్రమశిక్షణ పాటించడం వల్ల శరీర గడియారం స్థిరీకరించబడుతుంది. అతిగా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను తగ్గించడం వల్ల జీర్ణ వ్యవస్థలో వైవిధ్యం పెరుగుతుంది.పులియబెట్టిన పదార్థాలు లేదా ప్రోబయోటిక్స్ తీసుకోవడం వల్ల మెదడుకు, జీర్ణవ్యవస్థకు మధ్య సంభాషణ మెరుగుపడి నిద్ర ప్రశాంతంగా పడుతుంది. సరళమైన, స్పృహతో కూడిన ఆహారపు అలవాట్ల ద్వారా రాత్రివేళల్లో మంచి నిద్రను పొందవచ్చు. జీర్ణ వ్యవస్థకు మేలు చేసే పదార్థాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల పగటిపూట ఉత్సాహంగా ఉండటమే కాకుండా, రాత్రిపూట గాఢ నిద్రను సొంతం చేసుకోవచ్చు. మీ ఆరోగ్య ప్రయాణంలో చిన్న చిన్న మార్పులు గొప్ప ఫలితాలను ఇస్తాయి. కాబట్టి నేటి నుంచే జీర్ణక్రియకు ప్రాధాన్యతనిస్తూ ఆహారపు అలవాట్లను మార్చుకోండి.

# పిల్లలు ఫోన్ వదలట్లేదా..?



ప్రస్తుతం వేసవి సెలవులు నడుస్తున్నాయి, స్కూలుకు వెళ్లాలనే టెన్షన్ లేదు దీంతో చాలా మంది పిల్లలు రోజంతా మొబైల్స్ లేదా టీవీలకే అతుక్కుపోతున్నారు. అయితే, రోజంతా ఇలా ఫోన్‌లు, టీవీలు చూడటం వల్ల పిల్లల ఆరోగ్యం పై ఎంతటి చెడు ప్రభావం పడుతుందో మీకు తెలుసా? ఇటీవల నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. రోజుకు 6 గంటల కంటే ఎక్కువ స్క్రీన్ చూడడం వల్ల పిల్లల్లో హై బ్లడ్ ప్రెషర్ సమస్య వచ్చే ప్రమాదం పెరుగుతుందని తేలింది. కాబట్టి పిల్లలు ఫోన్ వాడకం తగ్గించాలంటే ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.


మ్ షెడ్యూల్: వేసవి సెలవుల్లో పిల్లలను స్క్రీన్ టైమ్‌కు పూర్తిగా దూరం పెట్టడం సాధ్యం కాకపోవచ్చు. కానీ, వారి స్క్రీన్ టైమ్‌ను ఖచ్చితంగా తగ్గించవచ్చు. దీని కోసం మీరు ఫోన్ వాడేందుకు ఒక టైమ్ లిమిట్ సెట్ చేయాలి. ఆ నిర్ణీత సమయంలో మాత్రమే పిల్లలను మొబైల్ లేదా టీవీ చూడనివ్వాలి. దీని వల్ల పిల్లలు నెమ్మదిగా ఆ సమయానికే అలవాటు పడతారు.

అవుట్‌డోర్ యాక్టివిటీస్: పిల్లలు ఎప్పుడూ ఇంట్లోనే ఉంటే.. టీవీనో, ఫోనో చూడాలి అనిపిస్తుంది. కాబట్టి సాయంత్రం వేళల్లో వారిని కాసేపు బయటకు తీసుకెళ్లి శారీరక శ్రమ ఉండే పనులు చేయించడం మంచిది. ఉదాహరణకు, సాయంత్రం పూట పార్కుకు తీసుకెళ్లడం, సైక్లింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్ లేదా మరేదైనా ఆటలు ఆడేలా ప్రోత్సహించడం చేయాలి. ఇలా చేయడం వల్ల పిల్లలను యాక్టీవ్‌గా ఉంచవచ్చు. స్క్రీన్‌కు దూరంగా ఉంచవచ్చు. 2


క్రియేటివ్ పనుల్లో బిజీగా ఉంచండి: స్క్రీన్ టైమ్ తగ్గించాలంటే పిల్లలను వేరే పనుల్లో బిజీగా ఉంచడం చాలా ముఖ్యం. ఇందుకోసం డ్రాయింగ్, పెయింటింగ్, కథల పుస్తకాలు చదవడం, క్రాఫ్ట్స్ చేయడం, మ్యూజిక్ నేర్చుకోవడం లేదా పజిల్స్ సాల్వ్ చేయడం వంటి యాక్టివిటీస్ చేయించవచ్చు. ఇలా చేయడం ద్వారా స్క్రీన్ టైమ్‌ను తగ్గించడమే కాకుండా, పిల్లల ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను పెంపొందిస్తాయి.

కుటుంబంతో కలిసి సమయం గడపండి: తల్లిదండ్రులు పిల్లలతో కలిసి బోర్డ్ గేమ్స్ వంటివి ఆడినా, వారితో మాట్లాడినా లేదా ఏదైనా ఎంటర్‌టైన్‌మెంట్ చేసినా పిల్లలు టీవీ, మొబైల్‌లకు దూరంగా ఉండటమే కాకుండా ఫ్యామిలీకి దగ్గరగా ఉండేందుకు ట్రై చేస్తారు. కుటుంబంతో గడిపే సమయం పిల్లల మానసిక, భావోద్వేగ ఎదుగుదలకు ఎంతో మేలు చేస్తుంది.

మీరే ఒక రోల్ మోడల్‌గా : పిల్లలు తరచుగా తమ తల్లిదండ్రుల అలవాట్లను చూసే నేర్చుకుంటారు. ఇంట్లోని పెద్దలే ఎప్పుడూ మొబైల్స్ చూస్తూ ఉండిపోతే పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. కాబట్టి, తల్లిదండ్రులు కూడా పిల్లల ముందు మొబైల్‌ను వీలైనంత తక్కువగా ఉపయోగించాలి. మిమ్మల్ని చూసి పిల్లలు కూడా టీవీ, మొబైల్స్ వైపు తక్కువ శ్రద్ధ చూపుతారు.









# చింత చెట్టు పడి ఇల్లు ధ్వంసం

- అదృష్టవశాత్తు తప్పిన ప్రాణ నష్టం
- బాధిత మహిళకు సర్పంచ్ ఆర్థిక సహాయం అందజేత

**జూలూరుపాడు, మహా:** మండల పరిధి వినోబా నగర్ గ్రామంలో గాలివాన బీభత్సవానికి భారీ చింత చెట్టు ఇంటిపై పడి ఇల్లు ధ్వంసమైన సంఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో వచ్చిన బీకర గాలివానకు భారీ చింత చెట్టు గ్రామానికి చెందిన సిరికొండ లక్ష్మి ఇంటిపై పడిందన్నారు. ప్రమాద దాటికి లక్ష్మి నివాస గృహం పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారు. ప్రమాదానికి రెండు నిమిషాల ముందు లక్ష్మి వాష్ రూమ్ కు పోవడం వలన అదృష్టవశాత్తు ప్రాణ నష్టం తప్పిందన్నారు. భర్త చనిపోయి పెన్షన్ పైసలతో బతుకీడుస్తున్న లక్ష్మి గూడు చెదిరిపోవడంతో రోడ్డు పాలయ్యిందన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తన పరిస్థితిని అర్థం చేసుకొని తగిన సహాయాన్ని అందించాలని బాధితురాలు లక్ష్మి దీనంగా అభ్యర్థిస్తున్నట్లు తెలిపారు. వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ బాధితురాలుని పరామర్శించి, తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తానని బాధితురాలికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చౌడం నరసింహారావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి బ్యూరో, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎంల గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం తనిఖీ చేశారు.
ముందుగా గోడౌన్ సీల్‌ను పరిశీలించిన కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారుల సమక్షంలో సీల్‌ను తెరిపించి గోడౌన్‌లోకి ప్రవేశించారు. అనంతరం ఈవీఎంలు వీవీప్యాట్లు భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీ అనంతరం తిరిగి గోడౌన్‌కు సీల్ వేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అనుమతి లేనిదే ఎవ్వరినీ లోపలికి అనుమతించరాదని సంబంధిత అధికారులు భద్రతా సిబ్బందికి ఆదేశించారు. అలాగే సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించి కెమెరాల పనితీరు నిఘా వ్యవస్థను పరిశీలించారు. తనిఖీ అనంతరం గోడౌన్ తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ్ అగర్వాల్, బిజెపి జె.మోహన కృష్ణ, టిఆర్ఎస్ అనుదీప్, అమ్ ఆద్మీ పార్టీ రాంబాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది నవీన్, అశోక్ భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# వరదలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- అధికారులు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచన



**భద్రాద్రి బ్యూరో,** మహా:వరదలు ప్రకృతి వైపరీత్యాలను ఎదురుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంగా పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్‌డీఆర్ఎఫ్ డిడిఆర్ఎఫ్ సింగరేణి రెస్క్యూ టీం అగ్నిమాపక శాఖలతో కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ముందస్తు చర్యలుగా రక్షక బృందాలను ముంపుకు గురయ్యే ప్రాంతాల సమీపంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పోలీస్ ఎస్‌డీఆర్ఎఫ్ డిడిఆర్ఎఫ్ సింగరేణి రెస్క్యూ టీం అగ్నిమాపక శాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.
బోట్లు లైఫ్ జాకెట్లు రోప్స్ చెట్లను తొలగించడానికి కావలసిన కట్టర్లను ఇతర రక్షణ సామాగ్రిని ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.
ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణ ఆస్తులకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలుగా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ క్రాంతి కుమార్, టీజీఎస్పి అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, ఆపరేషన్ ఆర్ఐ బి.రవి, సింగరేణి రెస్క్యూ టీం ఇంచార్జ్ అనంత రాములు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు సుమంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో భువనగిరి ఎంపీ చాల కిరణ్ కుమార్ రెడ్డి

**న్యూఢిల్లీ / యాదాద్రి భువనగిరి జూన్ 3 మహా :** :భువనగిరి ఎంపీ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పార్లమెంట్‌లో జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆన్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పీఎం స్వనిధి (PM SVANidhi) పథకం అమలు పురోగతిని సమీక్షించారు.వీధి వ్యాపారుల జీవనోపాధి మెరుగుదల, ఆర్థిక సమ్మిళితం, డిజిటల్ సాధికారత మరియు ఆర్థిక కార్యకలాపాల ప్రోత్సాహంపై కమిటీ చర్చించింది.ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వీధి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాల జారీ, డాక్యుమెంటేషన్ ఇబ్బందులు, అర్హులైన వీధి వ్యాపారుల గుర్తింపు, అలాగే క్రెడిట్ కార్డుల మంజూరులో జరుగుతున్న జాప్యాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.పథకం ప్రయోజనాలు ప్రతి అర్హులైన వీధి వ్యాపారికి సకాలంలో అందేలా విధానాలను సరళీకృతం చేయాలని ఆయన సూచించారు.



# వార్డు సభలను విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



భద్రాద్రి బ్యూరో, మహా:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా నిర్వహించనున్న గ్రామ వార్డు సభలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈనెల 4, 6, 8, 10 తేదీలలో నిర్వహించనున్న గ్రామ వార్డు సభల ఏర్పాట్లపై బుధవారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకెళ్లడం ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడం గ్రామాలు వార్డుల స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు చేపట్టడం లక్ష్యంగా గ్రామ వార్డు సభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలాల పరిధిలోని గ్రామాలను నాలుగు క్లస్టర్లుగా మున్సిపాలిటీల పరిధిలోని వార్డులను కూడా క్లస్టర్లుగా విభజించి ప్రణాళికాబద్ధంగా సభలను నిర్వహించాలని సూచించారు.
గ్రామ వార్డు సభల ద్వారా ప్రజలకు వానాకాల సన్నద్ధత పారిశుధ్య నిర్వహణ అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తాగునీటి సరఫరా ఘన వ్యర్థాల నిర్వహణ చెరువులు జల వనరుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కల నాటకం సంరక్షణపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామం వార్డులో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలు పంటల మార్పిడి విధానం ఎరువుల సమతుల వినియోగం ఫార్మా రిజిస్ట్రేషన్ వానాకాల సాగుకు సంబంధించిన సూచనలపై అవగాహన కల్పించాలని తెలిపారు.
అదేవిధంగా జనగణన కార్యక్రమం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయాలన్నారు. విద్యుత్ నీటిపారుదల పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన సేవలు ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామ వార్డు సభల్లో విస్తృతంగా వివరించాలని ఆదేశించారు. ప్రజలు మహిళా సంఘాల సభ్యులు రైతులు యువత స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనేలా ముందస్తుగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

# ఖాజీల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలి

**జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారికి మహమ్మద్ ఖాన్ వినతి**



**బూర్గంపహాడ్, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ ఖాజీల పనితీరును మెరుగుపరచడంతో పాటు వారసత్వ నియామకాలకు స్వస్తి పలికి, నిఖా రుసుములను క్రమబద్ధీకరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్ బుధవారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిని (DMWO) మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలోని ముస్లిం సమాజం ఖాజీల వ్యవస్థలో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా ఖాజీల నియామకాల్లో గత అనేక సంవత్సరాలుగా వారసత్వ పద్ధతి కొనసాగుతుండటంతో సమాజంలోని ఇతర అర్హులైన పండితులు, విద్యావంతులైన యువతకు అవకాశాలు దక్కడం లేదన్నారు. అందువల్ల ప్రస్తుత నియామక విధానాన్ని సమీక్షించి కొత్తవారికి అవకాశాలు కల్పించాలని కోరారు.అలాగే జిల్లాలో ఒక్కో ఖాజీ ఒక్కో విధంగా నిఖా ఫీజులు వసూలు చేస్తున్నారని, అధికారిక రసీదులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఒక నిర్ణీత నిఖా రుసుమును ఖరారు చేసి, దానిని ఖాజీల కార్యాలయాల వద్ద బహిరంగంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖాజీలు వివాహ రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించేలా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.పేద ముస్లిం వర్గాలపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు మహమ్మద్ ఖాన్ తెలిపారు.

# పోలవరం ముంపు సమస్యలపై సీడబ్ల్యూసీ అధికారులకు వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

**ముంపు ప్రాంతాల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్**



**బూర్గంపహాడ్, మహా :** పోలవరం ప్రాజెక్టు కారణంగా తెలంగాణలోని ముంపు ప్రాంతాల సమస్యలను పరిష్కరించి, ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ అశ్వాపురం, బూర్గంపాడు మండలాలకు చెందిన BRS పార్టీ నాయకులు బుధవారం సారపాక ఐటీసీ గెస్ట్ హౌస్‌లో సీడబ్ల్యూసీ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా BRS పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ పోలవరం ముంపు ప్రాంతాల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర అనిశ్చితిలో జీవిస్తున్నారని పేర్కొన్నారూ. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించాలని డిమాండ్ చేశారు.
వినతిపత్రంలో ప్రధానంగా సమగ్ర బ్యాక్ వాటర్ అధ్యయనాన్ని వెంటనే నిర్వహించాలని, తెలంగాణ ముంపు గ్రామాలకు ప్రత్యేక పునరావాస ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. పోలవరం ఆపరేషన్ రూల్ కర్వ్‌ను సవరించడంతో పాటు ప్రాజెక్టు డిజైన్, స్పిల్‌వే సామర్థ్యాన్ని పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే కిన్నెరసాని, ముర్రేడు తదితర వాగులపై ప్రత్యేక అధ్యయనాలు నిర్వహించి, భద్రాచలం పట్టణానికి శాశ్వత వరద రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. పినపాక నియోజకవర్గంలో కొత్త ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్‌కు ప్రత్యేక భద్రత, గోదావరిలో భారీ స్థాయిలో డిసిల్టింగ్ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.
కరకట్టలు, పంపింగ్ స్టేషన్లు, రక్షణ గోడలు, పునరావాస చర్యలు వంటి అన్ని రక్షణ చర్యలను పోలవరం ప్రాజెక్టు వ్యయంలో భాగంగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించే ఎలాంటి నిర్ణయాలను అమలు చేయరాదని, లేనిపక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో బూర్గంపాడు మండల BRS అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి, అశ్వాపురం మండల BRS అధ్యక్షులు కోడి అమరేందర్, మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, నాయకులు వెన్న అశోక్ కుమార్, కంచుగంట్ల వీరభద్రం, గొర్రెముచ్చు వెంకటరమణ, డాక్టర్ బాబు, కర్రీ నాగేశ్వరరావు, భూక్య కృష్ణ, బొబ్బిలి దాసు, గోపికృష్ణ, రామకృష్ణ, సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.



# కొండచిలువ కలకలం

చాకచక్యంగా కొండచిలువను బంధించిన రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి ఎం.డి మహమూద్.

**సత్తుపల్లి, జూన్ 3: మహా :** స్థానిక జే.వి.ఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ బాలికల హాస్టల్‌లో 12 అడుగుల కొండచిలువ కలకలం రేపింది. గురువారం ఉదయం హాస్టల్ సిబ్బంది పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న సమయంలో గది మూలలో కొండచిలువ సంచరించడం గమనించి భయాందోళనకు గురయ్యారు. ఈ సమాచారాన్ని చరవాణితో ఫారెస్ట్ అధికారులకు అందించారు.
సమాచారం అందుకున్న ఫారెస్ట్ సిబ్బంది కొండచిలువను బంధించడంలో అపార అనుభవం కలిగిన రిటైర్డ్ ఫారెస్ట్ ఉద్యోగి ఎం.డి మహమూద్ తో సహా ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఎం.డి మహమూద్ కొండచిలువ సంచారాన్ని గుర్తించి చాకచక్యంగా వ్యవహరించి ప్రత్యేక జాగ్రత్తలతో కొండచిలువను సురక్షితంగా బంధించి ఫారెస్ట్ అధికారుల సమక్షంలో సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో హాస్టల్ సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎం.డి మహమూద్ ధైర్య సాహసాలను అభినందించారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ అడవి జంతువులు తమ నివాస ప్రాంతాల్లోకి వచ్చినప్పుడు భయాందోళనలకు గురి కాకుండా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



# మాత పితృ గో క్షేత్రంలో ప్రత్యేక పూజలు

**ఆలేరు జూన్ 3 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలోని శ్రీ మాతాపితృ గోక్షేత్రంలో మూలమంత్ర సహిత శ్రీమద్ భాగవత పారాయణ వైభవంగా ప్రారంభమైనది. 15 మంది రుత్వికులు నిత్యం ఉదయం, సాయంత్రం భాగవత పారాయణ జరుగుతున్నది. లోకకల్యాణంతో పాటు కామ్యార్థం కోసం ఆదివారం వరకు విశేష హోమాలు నిర్వహిస్తున్నామని గోక్షేత్రం అధ్యక్షులు బిజుమల్ల బిందుమాధవ శర్మ తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం గోపాలకృష్ణ స్వామి ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. సప్తాహంలో భాగంగా బుధవారం శ్రీ సంతాన గోపాలకృష్ణ హోమం నిర్వహించారు. ఆరోగ్యం కోసం ధన్వంతరి,వివాహం కోసం స్వయం వర పార్వతి, సంకల్ప సిద్ధికోసం సహస్రమోదక గణపతి, చండీహోమాలు నిర్వహిస్తున్నామని అయన తెలిపారు. ఆదివారం పూర్ణాహుతి జరుగుతుందని వివరించారు.

# రైతులకు రెట్టింపు ఆదాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యం


**ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్.**

**పాలకుర్తి జూన్ 3 మహా:** పెద్దపల్లి జిల్లా, పాలకుర్తి మండలం, ఈసాలతక్కలపల్లి గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంపుపై అవగాహన సదస్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష చొరవతో చేపట్టిన ఈ కార్యక్రమంలో, ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొచ్చిన రైతులకు బోరుబావులు వేయించే కార్యక్రమాన్ని రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రైతు సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం. ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేందుకు వ్యవసాయ, ఉద్యానవన, భూగర్భ జలాల శాఖలు సమన్వయంతో పనిచేయాలి అని ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.23,852గా ఉందని, త్వరలోనే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని కూడా అందుబాటులోకి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు.జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీ గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, రైతులు ఆయిల్‌పామ్ సాగును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొక్కలు మరియు డ్రిప్ పరికరాలపై ప్రభుత్వం 90%, 80%, 70% వరకు భారీ సబ్సిడీలను అందిస్తోందని వివరించారు.ఉద్యానవన శాఖ అధికారిణి జ్యోతి మాట్లాడుతూ, పామాయిల్ పంట చీడపీడలను తట్టుకొని, తుఫానులను ఎదుర్కొని నిలబడే దృఢమైన పంట అని, పెద్దపల్లి జిల్లా నేలలు దీని సాగుకు ఎంతో అనుకూలమని పేర్కొన్నారు. తిరుమల ఆయిల్ కేన్ కంపెనీ సీఈఓ కేషు కళ్యాణ్ మాట్లాడుతూ, ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ.ఎం.సి చైర్మన్ గడ్డం తిరుపతి, సర్పంచ్ బండి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు



# సెటిల్‌మెంట్లు చేసే రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



**మహా వరంగల్ బ్యూరో :** భూతగాదాల కేసుల్లో మధ్యవర్తిత్వ వహిస్తూ సెటిల్‌మెంట్ల కు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేసే రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అదేశించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం కెయూసి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఏసిపి నర్సింహరావు, ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలికారు. పోలీస్ కమిషనర్ ముందుగా స్టేషన్ పరిసరాలు, స్టోర్, కేసు ప్రాపర్టీ గదులు, స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, బాలమిత్ర పోలీస్ స్టేషన్ క్రీడా ప్రాంగణాన్ని పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ సంబంధించిన రికార్డులను, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులను పరిశీలిస్తూ, పోలీస్ స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీ షీటర్లు, అనుమానితులు ఎవరు, ప్రస్తుతం వాళ్ళు ఎలావున్నారు.? ఏం చేస్తున్నారు.! మొదలైన వివరాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్ ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చే రౌడీ షీటర్లతో పాటు బెదిరింపులకు పాల్పడే వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వాలని, రౌడీ షీటర్ల పట్ల సానుభూతి ధోరణి ప్రదర్శించవద్దని, యాక్టివ్‌గా వున్న రౌడీల పై పోలీసులు నజర్ పెట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా, ముఖ్యంగా స్థానికంగా వున్న సామాజిక రుగ్మతల పై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని, విద్యా సంస్థ ల్లో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ట్రాఫిక్ నిబంధనల పై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, స్టేషన్ ఎస్.ఐలు అప్పగించిన సెక్టార్ పరిధిలో నేరాల నియంత్రించడం తో పాటు, ముందస్తూ సమాచారాన్ని సేకరించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎస్.ఐలు నవీన్ కుమార్, కళ్యాణ్‌కుమర్, రాజమౌళి, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు అన్లోడ్ వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

యాదాద్రి భువనగిరి జూన్ 3 మహా : జిల్లాలో ధాన్యం కొనుగోలు, ధాన్యం ఆన్ లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం వలిగొండ మండలం నాగారంలోని వాసవి రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంక రెడ్డి తో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రైస్ మిల్లులో దాన్యం లోడు లారీలు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. లోడ్ తో వచ్చిన లారీలను ఎప్పటికపుడు అన్లోడ్ చేయాలన్నారు. ప్రతి రోజు ధాన్యం లోడుతో ఎన్ని లారీలు మిల్లుకు వస్తున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో లారీ అన్లోడ్ చేయడానికి ఎంత సమయం పడుతుందని అడిగి తెలుసుకొని వచ్చిన వెంటనే హమాలీలతో అన్లోడ్ చేయించాలన్నారు. ధాన్యం అన్లోడ్ చేయడం కోసం మిల్లులో హమాలీలు సరిపడా ఉన్నారా లేదా అని ఆరా తీసి సరిపడ హమాలీలు లేకపోతే ఎక్కువ మందిని పెట్టుకొని ధాన్యం దిగుమతి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితి లోనూ మిల్లుల వద్ద ధాన్యం లోడ్ తో వచ్చిన వాహనాలు ఆగడానికి వీలు లేదన్నారు. ఏ రోజు వచ్చిన లారీ ఆరోజే అన్లోడ్ చేసి పంపించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంట వెంటనే లారీలను తిరిగి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి రోజా రాణి,,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఇళ్లున్నా హక్కులు లేవు.. కాలనీవాసుల గోడు

- **నాలుగు దశాబ్దాల కాలనీలకు రిజిస్ట్రేషన్ అడ్డంకులు**

**కుషాయిగూడ, మహా:** కుషాయిగూడ డివిజన్ పరిధి కాలనీలకు చెందిన పలు సర్వే నెంబర్లను రిజిస్ట్రేషన్ శాఖ నిషేధిత జాబితా నుంచి తొలగించి, యూఎల్‌సీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం సమర్పించారు. శివసాయినగర్, ఇందిరానగర్, సాయినగర్, మీనాక్షినగర్, మారుతి కాలనీ, టీచర్స్ కాలనీ, చర్లపల్లి బీఎన్ఆర్ రెడ్డినగర్ ప్రాంతాలకు చెందిన పలు సర్వే నెంబర్లు ప్రస్తుతం కాప్రా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు.దాదాపు నాలుగు దశాబ్దాలుగా వందలాది కుటుంబాలు నివాసముంటున్న ఈ కాలనీల్లోని ఇండ్లు, ఖాళీ స్థలాలపై నిషేధం కొనసాగడం వల్ల బ్యాంకు రుణాలు పొందడం కష్టంగా మారిందన్నారు. కూతుళ్ల పెళ్లిళ్లు, పిల్లల విద్య, వైద్య అవసరాల కోసం ఆస్తులను వినియోగించుకునే పరిస్థితి లేక ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.
ఎల్ఆర్ఎస్, భవన అనుమతులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ పత్రాలకు విలువ లేకపోవడం వల్ల కుటుంబాలు నష్టపోతున్నాయని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మను చౌదరి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, నాయకులు నేమూరి మహేష్ గౌడ్, సీఎస్ఎస్ అధ్యక్షురాలు ఎంపల్లి పద్మారెడ్డి, జౌండ్ల ప్రభాకర్ రెడ్డి, బీవీ నరసింహారెడ్డి, పలుగుల మహేందర్, కాటేపల్లి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అపరిచిత వ్యక్తులు అనుమాదాస్పద వస్తువులు కనిపిస్తే

- **సమీప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయండి.**
- **జవహర్ నగర్ ఏసీపీ చక్రపాణి**

**కుషాయిగూడ, మహా :** అపరిచిత వ్యక్తులుఅనుమానాస్పద వస్తువులు కనిపిస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే తెలియపరచాలని, తద్వార నేరస్తుల కదలికలు శాంతి భద్రతల పర్యవేక్షణ సులువు అవుతుందని జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి పేర్కొన్నారు. జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద జవహర్ నగర్ ఏసిపి చక్రపాణి ఇన్స్పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించి కాలనీ భద్రతపై డబల్ బెడ్ రూమ్ వాసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జవహర్ నగర్ పోలీస్ సిబ్బంది కృషి అభినందనీయమని జవహర్ నగర్ లోని సమస్యాత్మక ప్రాంతాలలో గంజాయి సేవించే ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. యువత మత్తుకు బానిస కావద్దని సరైన మార్గంలో పయనించి రాష్ట్రానికి తద్వారా దేశానికి పేరు తేవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ రాము నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేవాలయ నూతన కమిటీ ఎన్నిక

**అధ్యక్షునిగా నవీన్ కుమార్**

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్ బాలాజీ నగర్ మార్కెట్లోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీని ఆలయ సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలాజీ నగర్ లోని పేరు ప్రఖ్యాతలుగాంచిన ప్రముఖ ఆలయమైన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో దేవాలయ అభివృద్ధి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడం కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. అనంతరం నూతన ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జమాల్ పూర్ నవీన్ కుమార్ ను ఆలయ కమిటీ అధ్యక్షునిగా దేశపతి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన ఆలయ కమిటీ సభ్యులకు రుణపడి ఉన్నానని తెలిపారు. దేవుని సేవలో మరింత జాగరుత తో వ్యవహరిస్తానని తెలిపారు. ఈ కమిటీలో గౌరవ సలహాదారులుగా కారంగుల శంకర్ గౌడ్, రాజు గౌడ్, అశోక్ గౌడ్, రాజేశం గుప్తా, నర్సింగరావు, సంతోష్ గుప్తా, మల్లేశం గౌడ్, ఆలయ కమిటీ సభ్యులుగా సుధాకర్ రెడ్డి, ఓం ప్రకాష్, నరసింహ, సందీప్, రాకేష్, నవీన్, గాయత్రి, చందు, కరుణాకర్, రజనీకాంత్, వెంకటేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు భక్తులు శుభాకాంక్షలు తెలియజేశారు.

# మున్సిపల్ ఆఫీస్ లో లక్కీ డ్రా

**ఆదిలాబాద్ మహా:** అదిలాబాద్ మున్సిపాలిటీలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా బైకుల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి బుధవారం పురపాలక సంఘ కార్యాలయంలో లక్కీ డ్రా నిర్వహించారు.అధికారులు, కౌన్సిలర్లు అందరి సమక్షంలో పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహించినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తెలిపారు. అదిలాబాదులో పట్టణంలోని 49 వార్డులకు కలిపి 747 అప్లికేషన్లు రాగా అందులో 65 రిజెక్ట్ అయినట్టు వివరించారు..మిగతావాటిలో 27 మందిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్టు తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో లబ్దిదారుల యొక్క వివరాలు నోటీస్ బోర్డు పై అతికించనున్నట్టు తెలిపారు. ఈ లక్కీ డ్రా అందరి సమక్షంలో వీడియో గ్రఫీ ద్వారా పారదర్శకంగా చేపట్టినట్టు తెలిపారు.



ఎవరూ ఎలాంటి అపోహలకు గురికావద్దని , బైక్ ఇప్పిస్తానని మభ్యపెట్టే మధ్యవర్తులకు డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మహ్మద్ రోహిత్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి షేక్ కలీమ్ ,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మెప్మా పీడీ రాజు , వార్డుల కౌన్సిలర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రెండు డీసీఎంలు ఢీ ఘటనలో ఒక రైతు, 300 గొర్రెల మృతి

- **సంఘటన స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**
- **బాధిత కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం**



**దేవరకొండ /యాదాద్రి భువనగిరి జూన్ 3 మహా :** దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం ఎర్ర గుంటపల్లి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం ఎర్రగుంటపల్లి సమీపంలో గొర్రెల లోడుతో వెళ్తున్న డీసీఎం లు ఒక దానితో ఒకటి ఢీ కొనగా ఈ ప్రమాదం ఏర్పడి విషాద ఘటచోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 300 గొర్రెలు మృతి చెందగా, నాగర కర్నూల్ జిల్లా కోడూరు మండలానికి చెందిన గొర్రెల రైతు చిట కొండ ఎల్లయ్య, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఆయన భార్య, కుమారుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.
ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్ , తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం చైర్మన్ ఎగ్గే మల్లేశం , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం, ఫిష్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్యలతో కలిసి సంఘటన స్థలానికి బుధవారం చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సంఘటన స్థలంలో, మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రి జూపల్లి కృష్ణారావులతో, కలెక్టర్ లకు ఫోన్ చేసి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రమాద స్థలంలో మృతిచెంది పడి ఉన్న వందలాది గొర్రెలను చూసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బీర్ల అయిలయ్య , అనంతరం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి గాయపడిన కుటుంబ సభ్యులను పరామర్శించారువారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు.అలాగే మార్చరీలో ఉన్న రైతు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు.
ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కురుమ సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటాయని భరోసా కల్పించారు. పిల్లల చదువుకు అండగా ఉంటామన్నారు.ఈ ఘటన ఎంతో బాధాకరమని, రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని బీర్ల అయిలయ్య తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు కోరుతూ

# జన సంద్రమైన మానవహారం

- **పేటలో పాఠశాలను ఏర్పాటు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోండి**
- **జేఏసీ కన్వీనర్ తోటపల్లి శంకర్**



**కుషాయిగూడ, మహా :** గబ్బిలాల పేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున బస్తీ వాసులతో వేలాది మందితో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గబ్బిలాల పేట ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ (జేఏసీ) కన్వీనర్ తోటపల్లి శంకర్ హెచ్చరించారు. బాలాజీ నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం గబ్బిలాల పేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో వందలాదిమందితో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఏసీ కన్వీనర్ తోటపల్లి శంకర్ హాజరై మాట్లాడుతూ, గబ్బిలాల పేట చుట్టు పక్క ప్రాంతాలైన రాజీవ్ గాంధీ నగర్, శాంతినగర్, గాంధీ నగర్, జయశంకర్ నగర్, కేసీఆర్ నగర్, పాత గబ్బిలాల పేట తదితర ప్రాంతాలలో వందలాదిమంది చదువుకు నోచుకోని పేద పిల్లలు ఉన్నారని వారికి విద్యాభ్యాసం అందని మామిడిపండు లాగే తయారైందని, అక్కడ ఉన్న ఒకే పాఠశాల కేవలం రెండు గదులతోనే నిర్వహిస్తున్నారని వాపోయారు. గబ్బిలాల పేటలో జిల్లా కలెక్టర్ స్థలాన్ని ఏర్పాటు చేయగా స్థానికులు కొందరు తమ భూములని కోర్టుకు వెళ్లి అడ్డు కలుగుతుండటం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన మరింత ఉధృతం చేస్తామని గబ్బిలాల పేటలో ప్రభుత్వ పాఠశాలను సాధించేవరకు పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ మాజీ ఉపసర్పంచ్ రావల్కోల్ నరసింహ గౌడ్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు గడ్డం సదానందం, సిపిఐ దర్శనం యాదగిరి, సిపిఎం శివన్నారాయణ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కాలేశా, పౌరస్పందన వేదిక సురేష్ కుమార్, టి యు సి ఐ వి ప్రవీణ్, ఐఎఫ్టియు శివ బాబు, ఐఎఫ్టియు షేక్షావలి, చైతన్య మహిళా సంఘం అల్లూరి సావిత్రి, పిఓడబ్ల్యు లక్ష్మీబాయి, స్వరూపక్క, సావిత్రి, సునీత, జయసుధ, మంజుల తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామ వార్డు సభలను విస్తృత స్థాయిలో నిర్వహించాలి.!

- **సమస్యల పరిష్కారానికి గ్రామసభ ఓ వేదికగా నిలుస్తుంది.!**
- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**
- **సర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని**
- **వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో....**
- **ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్షి...**
- **పర్యావరణ వారోత్సవాలు నిర్వహించాలి...**
- **అధికారులతో సమీక్ష.. ఆదేశాలు: జిల్లా కలెక్టర్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలో గ్రామ సభలు, వార్డు సభలను విస్తృతంగా నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతోపాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్ఓలు), ఎంపీడీఓలు, వ్యవసాయ, పంచాయతీరాజ్, మున్సిపల్, పౌర సరఫరాలు తదితర శాఖల అధికారులతో పర్యావరణ వారోత్సవాలు, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, గ్రామ సభలు - వార్డు సభల నిర్వహణ, ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (ఎస్ఐఆర్), రైతు నమోదు, ఘన వ్యర్థాల నిర్వహణ, వర్షాకాల సన్నాహాలు, ధాన్యం సేకరణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జూన్ 4, 6, 8, 10 తేదీలలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలోని వార్డులలో గ్రామ, వార్డు సభలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని తెలిపారు. ప్రతి సభను సంబంధిత సీనియర్ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో చేపడుతున్న కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామస్థాయి సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించే వేదికగా గ్రామ సభలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక విస్తృత పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి అధికారి చురుకుగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితాల సవరణ, నవీకరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాల తొలగింపు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జరుగుతున్న మ్యాపింగ్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామ సభలు, వార్డు సభలలో మ్యాపింగ్ ప్రక్రియపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలు అక్కడికక్కడే తమ వివరాలను నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ప్రతి సభలో తప్పనిసరిగా పాల్గొని ప్రజలకు మార్గనిర్దేశం చేయాలని, మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. రైతు నమోదు కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపడుతోందని, జిల్లాలోని ప్రతి రైతు వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మండలాల వారీగా నమోదు పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

**వర్షా కాలం సమీపిస్తున్న నేపథ్యంలో....**

రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, సబ్సిడీలు, బీమా, మార్కెటింగ్ అవకాశాలు నమోదు ఆధారంగానే అందుబాటులోకి వస్తాయని రైతులకు వివరించాలని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖలు ముందస్తు సన్నాహాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముంపు ప్రాంతాలు, చెరువులు, వాగులు, కాలువల పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల శుభ్రత, నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు, గ్రామీణ ప్రాంతాల్లో వర్షపు నీటి పారుదల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్షి...**

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్షిస్తూ, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఐదు రోజులలోగా మిల్లులకు తరలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం తరలింపునకు అవసరమైన రవాణా వాహనాలను అందుబాటులో ఉంచి ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలిగించే విధంగా నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పర్యావరణ వారోత్సవాలు నిర్వహించాలి...**

పర్యావరణ వారోత్సవాల సందర్భంగా జిల్లాలో మొక్కల నాటకం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, నీటి సంరక్షణ, పరిశుభ్రత కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

**తడి-పొడి వ్యర్థాల నిర్వహణ...**

ఘన వ్యర్థాల నిర్వహణను గ్రామాలు, పట్టణాల్లో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. చెత్త వేరు చేసే విధానం, తడిపొడి వ్యర్థాల నిర్వహణ, కంపోస్టింగ్ యూనిట్ల వినియోగం, స్వచ్ఛ గ్రామాలు - స్వచ్ఛ పట్టణాల లక్ష్య సాధనపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు.

**గ్రామ సభలలో ప్రజాభిప్రాయాలను తెలుసుకోవాలి.....**

గ్రామ సభలు, వార్డు సభలలో ప్రతి ఒక్కరినీ భగస్వామ్యం చేయాలని సూచిస్తూ, గ్రామ సభలు, వార్డు సభల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని అభివృద్ధి ప్రణాళికల్లో ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఈఆర్ఓలు, మండల వ్యవసాయ శాఖాధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ పై ఉద్యమకారులు ఫైర్

**భువనగిరి జూన్ 3 మహా న్యూస్ :** తెలంగాణ రాష్ట్రంపై పవన్ కళ్యాణ్ రెచ్చగొట్టే మాటలు మానుకోవాలని మలిదశ ఉద్యమకారులు టీయుజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ భువనగిరి మండల అధ్యక్షులు కొండాపురం శ్రీనివాస్ హెచ్చరించారు తెలంగాణ ముమ్మాటికి మా జాగిరే అని అన్నారు మీ రాష్ట్రం మీకు ఉండంగా మా రాష్ట్రంపై ఎందుకు నీకు అక్కస్ అని వారన్నారు తెలంగాణను వ్యతిరేకించిన మీకు తెలంగాణ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు

# కాప్రాలో కలకలం

- **మైనర్ బాలికతో వృద్ధుడి అసభ్య ప్రవర్తన**
- **బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు**
- **భరోసా సెంటర్‌కు తరలించిన పోలీసులు**

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కాప్రా సాయిప్రియ కాలనీలో ఓ మైనర్ బాలికతో వృద్ధుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. బాలిక తల్లిదండ్రులు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక స్టేట్‌మెంట్ ను నమోదు చేయడానికి ఆమెను భరోసా సెంటర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. బాలిక వాంగ్మూలం ఆధారంగా నిందితుడిపై సంబంధిత చట్టాల కింద పలు సెక్షన్లు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కుషాయిగూడ పోలీసులు వెల్లడించారు. ఘటన స్థానికంగా కలకలం రేపింది.



# నర్సా బాయ్ కుంటను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జోనల్ కమిషనర్

**పార్కులు, కుంటల సుందరీకరణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని నర్సాబాయ్ కుంటను, టీఎన్జీవో కాలనీలోని పార్కును బుధవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సుందరీకరణ పై క్షేత్రస్థాయిలో వెళ్ళి పరిశీలించారు.
బాబుల్ రెడ్డి నగర్ లోని నర్సా బాయ్ కుంటను త్వరలోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హామీ ఇచ్చారు.టీఎన్జీవో కాలనీలో ప్రస్తుతం కొనసాగుతున్న పార్కు సుందరీకరణ పనులను ఆయన నిశితంగా పర్యవేక్షించారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించడమే ధ్యేయంగా ఈ సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోజీహెచ్ఎంసీ అధికారులు,పార్టీ నాయకులు ప్రేమ్ దాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనంజయ్,పార్టీ నాయకులుసోమ శ్రీనివాస్ గుప్తా, ప్రేమ్ గౌడ్, భాషా శ్రీను, సరికొండ వెంకటేష్, జగన్, ఓం ప్రకాష్, మదన్ గౌడ్, కిషోర్, హనుమంతు, కే ఎస్ రెడ్డి, సందీప్, శ్రీనివాస్, పవన్, బాబురావు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా కాలువ తోవ్వకాలు.

**పట్టింపు లేని జిహెచ్ఎంసి అధికారులు..**

**రాజేంద్రనగర్ మహా ;** నేషనల్ హైవే 44 సర్వీస్ రోడ్డు అనుకొని ప్రభుత్వం వరద కాలువ వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరిని సంప్రదించకుండా ఇష్టానుసారంగా వరద కాలువ వ్యవస్థను ధ్వంసం చేస్తున్నారు. శంషాబాద్ సర్కిల్ పరిధిలోని సాతాంరాయి నేషనల్ హైవే 44 సర్వీస్ రోడ్డు పక్కన నేషనల్ హైవే అథారిటీ వారు హైవే గుండా వరద కాలువను ఏర్పాటు చేశారు. వరద కాలువను జిహెచ్ఎంసి అధికారుల అనుమతులు తీసుకొని చేయవలసిన పనులను ఇష్టానుసారంగా వరద కాలువలను ధ్వంసం చేస్తున్నారు. ఇటు పక్కకు జిహెచ్ఎంసి అధికారులు ఎవరు రారని ధైర్యంతో తోవ్వుతున్నట్లు స్థానికులు తెలిపారు. అనుమతులు లేకుండా వరద కాలువలను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ANN తెలుగు
మహా పత్రిక 07
గురువారం, హైదరాబాద్ | 04-06-2026 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM



## సైక్లింగ్ ఎంతో మంచిదిఅదనపు కలెక్టర్, డీఎఫ్ఓ

- అటవీ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ
- అద్భుత వ్యాయామమన్న అధికారులు
- విద్యార్థులతో మానవహారం

**ఆదిలాబాద్, మహా** : పర్యావరణ పరిరక్షణకు సైకిలింగ్ ఎంతో దోహదపడుతుందని అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శూన్య ఇంధనం గరిష్ట ఆరోగ్యం అనే నినాదంతో స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో భారీ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి ప్రారంభమైన ర్యాలీ కలెక్టర్ చౌక్, ఎన్టీఆర్ చౌక్, వినాయక్ చౌక్, నేతాజీ చౌక్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు సాగి తిరిగి స్టేడియానికి చేరుకుంది. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, ఇంధన పొదుపునకు సైకిల్ తొక్కడం ఎంతో మేలైన మార్గమని అడిషనల్ కలెక్టర్ వివరించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రతి ఒక్కరూ సైకిల్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలని, రోజువారి సైక్లింగ్ అనేది అద్భుతమైన వ్యాయామం గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో, ఒత్తిడిని తగ్గించడంలో అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుందని వివరించారు. పర్యావరణ వారోత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కోసం ఈ కార్యక్రమం చేపట్టామని డీఎఫ్ ఓ అన్నారు. ఇందులో భాగంగా జూన్ 7 ఆదివారం 5K రన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ రన్‌లో గెలుపొందిన విజేతలకు ప్రథమ 5వేలు , ద్వితీయ,3వేలు తృతీయ 2 వేల రూపాయల నగదు బహుమతులు అందించనున్నామని తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.అంతకు ముందు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మానవహారం నిర్వహించి పర్యావరణ పరిరక్షణపై నినాదాలతో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ శ్రీనివాస్, ఎఫ్డీఓ అరవింద్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ అధికారి అవినాష్, అటవీ శాఖ సిబ్బంది, వివిధ క్రీడాకారులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పద్మశాలి టౌన్ షిప్ మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు..


- జలమండలి ఎండీని కలిసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా** : ఏఎస్‌రావు నగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్ షిప్‌లో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. టౌన్ షిప్ ప్రతినిధులతో కలిసి జలమండలి ఎండీ అశోక్ రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. టౌన్ షిప్‌లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎండీ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే, శాశ్వత పరిష్కారంగా కొత్త మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే వినతిపై స్పందించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, పద్మశాలి టౌన్షిప్‌కు కొత్త మంచినీటి పైపులైన్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించి కేటాయించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. స్థల కేటాయింపు పూర్తయిన వెంటనే రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభించి, ప్రజలకు నిరంతరాయంగా మంచినీటి సరఫరా అందేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అదేవిధంగా జలమండలి ఈడీ పంకజకు కూడా సమస్యపై లేఖ అందజేయగా, త్వరలోనే సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎల్లప్పుడూ ముందుంటామని, పద్మశాలి టౌన్షిప్ ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు తన కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

వేములవాడ, మహా:వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వీటీఏడీఏ (వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఆధ్వర్యంలో రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం అభివృద్ధి పనులు, ప్రధాన రోడ్డు విస్తరణ పనులనుజిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై ఆర్ అండ్ బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగంగా పూర్తి చేయడంపై అధికారులకు పలు సూచనలు చేశారు.రాజన్న ప్రధాన ఆలయ విస్తరణ, ఇతర ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. పనుల్లో వేగం పెంచాలని, అవసరమైన పనివారి సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు.రాజన్న ఆలయం నుంచి మూల వాగు బ్రిడ్జి వరకు కొనసాగుతున్న ప్రధాన రోడ్డు విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. పనుల పురోగతి, పూర్తి చేయడం పై వేములవాడ మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. పనులు వేగంగా పూర్తి చేసి.. వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.



రాజన్న, బద్ది పోచమ్మ ఆలయాల విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదానం సత్రం నిర్మాణ పనులు, రోడ్డు విస్తరణ పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో గడువు తేదీ ఇవ్వాలని ఆయా శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.సమావేశంలో ఆర్అండ్ బీ ఈఈ నరసింహాచారి, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్ శర్మ, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- గ్రామ, వార్డుసభలను విజయవంతం చేయాలి
- గూగుల్ మీట్ లో కలెక్టర్ రాజర్షి షా ఆదేశాలు



**ఆదిలాబాద్ మహా** : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించే గ్రామ, వార్డుసభలను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ లో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన గూగుల్ మీట్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ,వార్డు సభల నిర్వహణ, ఏర్పాట్లు, జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేసారు.
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 4 నుండి జూన్ 12 వరకు నిర్వహించ తలపెట్టిన 'గ్రామసభల'ను అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి లోపాలు జరగకుండా చూడాలని, రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు గుడిసెలు లేని తెలంగాణ నిర్మాణానికి అధికారులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా జనగణన, భూభారతి పనులను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే, సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ టైమ్ మెంబర్‌షిప్ తీసుకునేలా అధికారులు చొరవ చూపాలన్నారు. రాబోయే వర్షాలు, వరదల వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను అప్రమత్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, విరిగిన విద్యుత్ స్తంభాలను, వేలాడుతున్న ప్రమాదకర విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించి, పాఠశాలల పునఃప్రారంభోత్సవం సందర్భంగా బడిబాట' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు రాజేశ్వర్ , ఆర్.ఎస్.చిత్రు, జడ్పీ సీఈఓ రవి, డీఆర్డీఓ రవీందర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌ

## మణుగూరులో రవాణా శాఖ కార్యక్రమం..

- రోడ్డు భద్రతపై డ్రైవర్లు, యాజమాన్యాలకు అవగాహన..
- ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు సీజ్ చేస్తాం..
- విద్యార్థుల భద్రతపై రాజీ లేదు..
- ఎంవీఐ వెంకట పుల్లయ్య..



**మణుగూరు, మహా :** విద్యార్థుల రవాణాలో భద్రతా ప్రమాణాలు పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులు రోడ్లపై నడిపితే వాటిని సీజ్ చేస్తామని భద్రాచలం యూనిట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య హెచ్చరించారు. విద్యార్థులు దేశ భవిష్యత్తు అని, వారి భద్రతను కాపాడాల్సిన బాధ్యత విద్యా సంస్థల యాజమాన్యాలు, డ్రైవర్లు, సహాయకులతో పాటు రవాణా శాఖపైనా ఉందన్నారు. బుధవారం మణుగూరులోని స్నేహ గార్డెన్స్‌లో రవాణా శాఖ భద్రాచలం యూనిట్ ఆధ్వర్యంలో విద్యా సంస్థల యాజమాన్యాల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం అరవింద్ కుమార్ అధ్యక్షతన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ వెంకట పుల్లయ్య మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు కేవలం వాహనాలు లేదా రహదారి పరిస్థితులే కాకుండా డ్రైవర్ మానసిక స్థితి కూడా ప్రధాన కారణమవుతుందని తెలిపారు. డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం, నిద్రమత్తులో డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, కోపం లేదా ఆందోళనతో డ్రైవింగ్ చేయడం, అతివేగం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రైవర్ అప్రమత్తత, ఓర్పు, క్రమశిక్షణ వల్ల అనేక ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

**భద్రతా నిబంధనలు తప్పనిసరి.**

ప్రతి విద్యాసంస్థ బస్సుకు చెల్లుబాటు అయ్యే ఫిట్‌నెస్ సర్టిఫికేట్, పర్మిట్, ఇన్సూరెన్స్, పీయూసీ ధృవపత్రాలు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్, ఎమర్జెన్సీ ఎగ్జిట్, స్పీడ్ గవర్నర్, జీపీఎస్, అత్యవసర సంప్రదింపు వివరాలు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.స్కూల్ బస్సు డ్రైవర్లకు కనీసం ఐదేళ్ల అనుభవంతో కూడిన చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, వారి వయస్సు 60 సంవత్సరాలు మించరాదన్నారు. అలాగే 15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల బస్సులను విద్యార్థుల రవాణాకు వినియోగించరాదని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సు ఎక్కే, దిగే సమయంలో అటెండెంట్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

**అరైవ్-అలైవ్ తో ప్రమాదాల నివారణ.**

రాష్ట్ర ప్రభుత్వం, రవాణా శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అరైవ్‌అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా అవగాహన కల్పిస్తున్నామని వెంకట పుల్లయ్య తెలిపారు. ప్రతి ఉదయం బస్సులో ఎక్కిన విద్యార్థి సాయంత్రం క్షేమంగా ఇంటికి చేరుకోవడమే అందరి లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు జి. మధుసూదన్ రెడ్డి, ఎం.డి. ఈసబ్ షరీఫ్, ప్రతాప్ రెడ్డి, ఐజాక్ థామోస్, శ్రీనివాస్, చంద్రమౌళి, సంపత్ రెడ్డి, జానిమియా ఖాన్, రామన్ రెడ్డి, నరేందర్, డ్రైవర్లు, సహాయకులు, రవాణా శాఖ సిబ్బంది భీముడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యానికి అండగా ప్రభుత్వం..

- ఈద్గా కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ..



**మణుగూరు, మహా** : అత్యవసర వైద్య చికిత్సల కోసం పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అశ్వాపురం మండలం సంద్రలబోడు గ్రామానికి చెందిన సీరపు అపర్ణకు రూ.3 లక్షల విలువైన ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాన్ని అందజేశారు. అలాగే బూర్గంపాడు మండలం భాస్కర్‌నగర్‌కు చెందిన రాయల వీరాంజనేయులకు వైద్య చికిత్సల నిమిత్తం రూ.3.50 లక్షల ఎల్‌ఓసీని అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్య సేవలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పలు ఆరోగ్య సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. అపర్ణ, వీరాంజనేయులకు మంజూరైన ఆర్థిక సహాయం వారి కుటుంబాలకు ఎంతో ఊరట నిస్తుందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజా సంక్షేమమే తన ధ్యేయమని, అవసరమైన సమయంలో ప్రతి కుటుంబానికి అండగా నిలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**- రూ.15 లక్షలతో ఈద్గా కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని ఈద్గా ప్రాంగణంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, గ్రామస్తుల సమక్షంలో ప్రత్యేక ప్రార్థనల మధ్య కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ప్రార్థనా స్థలాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముస్లిం సోదరుల విజ్ఞప్తి మేరకు ఈద్గా ప్రాంగణ అభివృద్ధికి రూ.15 లక్షల నిధులు మంజూరు చేసి కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ప్రారంభించడం సంతోషకరమన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈద్గా ప్రాంగణానికి రక్షణ కల్పించడంతో పాటు భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు.
నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు అన్ని మతాల ప్రార్థనా స్థలాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. మత సామరస్యం, సామాజిక ఐక్యతను కాపాడుతూ ప్రతి వర్గానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి అశ్వాపురం మండలాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఐటీడీఏ ఈఈ, ఏఈ ఐవీఎన్ ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీ సూపరింటెండెంట్ పిచ్చేశ్వరరావు, జీపీఓ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి యాకుబ్ పాల్గొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి బిక్షమయ్య, సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, ఊసా అనిల్‌కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్‌లు బానోతు సదర్లాల్, యేనిక ఉషారాణి, సప్కా పిచ్చయ్య, కొర్సా కృష్ణ, కుంజా జాను, ఎట్టి నరేష్, ఉపసర్పంచ్‌లు తుళ్లూరి ప్రకాశ్‌రావు, మేకల అంజిబాబు, నాయకులు వేములపల్లి రమేష్, లంకమల్ల కొండలరావు, చుంచు ఏకాంబరం, మాదినేని రాంబాబు, సోడే వెంకటేశ్వర్లు, ఏనిక రవి, ఎం.డి. షర్ఫుద్దీన్, తెల్లం వీరభద్రం, ఎస్.కే. ఖదీర్, తెల్లం నాగరాజు, రావులపల్లి నరసింహారావు, వేముల విజయ్, కోలా శశికాంత్, బట్టి వెంకన్న, తాటి రాంబాబు, కురం నరసింహారావు, తాటి శ్రీను, తాటి జంపయ్య, దారపు శ్రీను, జిన్నేక నాగయ్య, అద్దంకి బాలాజీ, కమ్మని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.ముస్లిం సోదరులు ఎస్.కే. శబ్బార్, ఆలీ, ఖురేషి, సాదిక్ పాషా, సి. హుస్సేన్, ఎస్.కే. గాలిబ్, ఎస్.డి. సర్వర్, ఎస్.కే. మున్నీర్, అబ్దుల్ బారి, ఎం.డి. షఫీ, ఎస్.కే. ఖాజా, ఎస్.కే. భాషా, ఎస్.కే. మదహర్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## ఆలేరులో సైకిల్ దినోత్సవం

**ఆలేరు జూన్ 3 మహా :** మేరా యువభారత్ సౌజన్యంతో స్థానిక ఫ్రెండ్స్ క్లబ్ఆలేరుఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ సైకిల్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు పట్టణంలోని హైస్కూల్ గేటు నుండి మెయిన్ రోడ్డు మీదుగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు , ర్యాలీలో విద్యార్థి యువజనులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు సైకిల్ తొక్కడం వలన మనిషి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగం ఉంటుందని నినాదాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు ముఖ్యంగా మనిషి సైకిల్ తొక్కడం వలన చక్కెర వ్యాధి, గుండె జబ్బులు, ఇతర రోగాలు రాకుండా ఆరోగ్యంగా ఉండడానికి ఎంతో దుహాధపడుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో గుజ్జ అశోక్ , పత్తి రాజు , కటకం హరినాథ్ , క్లబ్బు సహాయ కార్యదర్శి పూల చంద్రకుమార్, క్రీడల కార్యదర్శి రాహుల్ తేజ. వ్యాయామ ఉపాధ్యాయులు యాట సందీప్, మరియు ఫ్రెండ్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



## రామన్నపేట నుండి వేములకొండకు బస్సు ప్రారంభోత్సవం


**ప్రభుత్వ విప్ వేముల వీరేశం**

**భువనగిరి జూన్ 3 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లారామన్నపేటనుండి వేములకొండకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సు సేవలను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారంప్రారంభించారు ..ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ బస్సు సేవలు ఎంతో ఉపయోగపడుతయని పేర్కొన్నారు..


## శిక్షణ తీసుకొని ఉపాధి పొందాలి

**లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి**

**మంచిర్యాల, మహా :** శిక్షణ తీసుకొని ఉపాధి పొందాలని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌సెటీఐ) లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి అన్నారు. బుధవారం ఆర్‌సెటీఐ మంచిర్యాలలో ఏర్పాటు చేసిన 14 రోజుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా వయోజన విద్యా కార్యక్రమ అధికారి శ్రీనివాస్, ఆర్‌సెటీఐ సంచాలకులు ఆశిష్ వార్లే, కార్మల్ పాఠశాల ప్రిన్సిపల్ సారూప్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూట్ ఉత్పత్తుల రంగంలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్‌సెటీఐ ప్రత్యేక శిక్షకుల ద్వారా జూట్ బ్యాగుల తయారీకి సంబంధించిన సాంకేతిక అంశాలు, నాణ్యత ప్రమాణాలు, ముడి పదార్థాల ఎంపిక, ఉత్పత్తి ప్రక్రియ తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు, మార్కెటింగ్ టెక్నిక్స్, వ్యాపార నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం, ఇతర నైపుణ్యాభివృద్ధి అంశాలపై కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తైన అనంతరం స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవాలనుకునే అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, అర్హులైన వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాలు కల్పించి ఆర్థిక అభివృద్ధికి సహకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొ



# చివరి నిమిషంలో ట్రైన్‌లో టికెట్ కావాలా..?



రైళ్లల్లో ఎక్కువగా ప్రయాణం చేసేవారికి తత్కాల్ టికెట్ల గురించి తెలిసే ఉంటుంది. అత్యవసరంగా ఎక్కడికైనా ట్రైన్లలో ప్రయాణం చేయాలనుకుంటే తత్కాల్ టికెట్లు ట్రైన్ బయల్దేరే ముందు రోజు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దాదాపు అన్ని రైళ్లల్లో తత్కాల్ టికెట్లను ముందు రోజు విడుదల చేస్తారు. ఐఆర్‌సీటీసీ, రైల్ వన్, ఆర్‌సీటీసీ ఏజెంట్లు లేదా ఇతర యాప్స్ ద్వారా వీటిని బుక్ చేసుకోవచ్చు. ఈ టికెట్లకు ఫుల్ డిమాండ్ ఉంటుంది. దీంతో విడుదల చేసిన కాసేపటికే అయిపోతాయి. తత్కాల్‌తో పాటు ప్రీమియం తత్కాల్ టికెట్లు కూడా ఉన్నాయని మీకు తెలుసా..? అసలు ప్రీమియం తత్కాల్ ఏంటి? ఏయే ట్రైన్లలో అందుబాటులో ఉంటాయి? అనే విషయాలు చూద్దాం.

**ప్రీమియం తత్కాల్ అంటే ఏంటి..?**

అత్యవసర ప్రయాణం చేసేవారి కోసం రైల్వేశాఖ తత్కాల్ టికెట్లను ప్రవేశపెట్టింది. సాధారణ టికెట్లతో పోలిస్తే వీటి ధర కాస్త ఎక్కువగా ఉంటుంది. ఏసీ క్లాసులకు ఉదయం 10 గంటలకు, నాన్ ఏసీ క్లాసులకు ఉదయం 11 గంటలకు టికెట్లను విడుదల చేస్తారు. ఇక ప్రీమియం తత్కాల్ టికెట్ల విషయానికొస్తే.. వీటిని తత్కాల్ టికెట్లకు అధునాతన రూపంగా వీటిని చెప్పవచ్చు. చివరి నిమిషంలో టికెట్ అవసరమై ఎక్కువ ధర చెల్లించేందుకు సిద్ధమయ్యే ప్రయాణికుల కోసం ఈ కేటగిరీని ప్రవేశపెట్టారు. డిమాండ్‌ను బట్టి ప్రీమియం తత్కాల్ టికెట్ల ధరలు అనేవి ఆటోమేటిక్‌గా పెరుగుతూ ఉంటాయి. అంటే సీట్లు నిండే కొద్ది ధరలు పెరుగుతూ ఉంటాయి. అందుకే ఈ కేటగిరీ టికెట్లు సాధారణ తత్కాల్ టికెట్లతో పోలిస్తే కాస్త ఎక్కువగా ఉంటాయి.

**ఏయే ట్రైన్లలో ఉంటాయంటే..?**

తత్కాల్ టికెట్లు చాలా రైళ్లల్లో అందుబాటులో ఉంటాయి. కానీ ప్రీమియం తత్కాల్ టికెట్లు అనేవి ఎంపిక చేసిన కొన్ని రైళ్లల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఏసీ క్లాసుల్లో టికెట్లను మాత్రమే ఈ ఆప్షన్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. టికెట్లు కూడా చాలా తక్కువ సంఖ్యలోనే అందుబాటులో ఉంటాయి. తత్కాల్ కోటా కింద టిక్కెట్లు దొరకనివారు ప్రీమియం తత్కాల్ కింద టికెట్లను పొందవచ్చు. ఈ కోటా కింద టికెట్ పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కానీ డిమాండ్, సీట్ల లభ్యతపై ఇది ఆధారపడి ఉంటుంది.

# నేటి నుంచి ఆర్‌బీఐ పాలసీ సమీక్ష




నేటి నుంచి ఆర్‌బీఐ గవర్నర్ అధ్యక్షతన మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) పరపతి విధాన సమీక్షను చేపట్టనుంది. మూడు రోజులపాటు నిర్వహించనున్న సమావేశాల్లో భాగంగా శుక్రవారం(5న) పాలసీ నిర్ణయాలు ప్రకటించనుంది. అయితే అత్యధిక శాతం మంది ఆర్థికవేత్తలు, ట్రెజరీ నిపుణులు ఈసారి యథాతథ పాలసీ అమలుకే ఎంపీసీ కట్టుబడవచ్చని అంచనా వేస్తున్నారు. వెరసి వడ్డీ రేట్లకు కీలకమైన రెపో రేటును 5.25 శాతం వద్దే కొనసాగించే వీలున్నట్లు భావిస్తున్నారు.మరోపక్క ద్రవ్యోల్బణ రిస్క్‌లు పెరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026-27) చివర్లో కేంద్ర బ్యాంకు(ఆర్‌బీఐ) కఠిన పరపతి విధానాలకు తెరతీసే అవకాశమున్నట్లు అభిప్రాయపడ్డారు. పాలసీ సమీక్షపై పీటీఐ వార్తా సంస్థ నిర్వహించిన సర్వేలో 11 మంది స్టేటస్ కోకు వీలున్నట్లు పేర్కొనగా.. నలుగురు మాత్రం 0.25% రెపో రేటు పెంపును అంచనా వేశారు.

**4 శాతానికి దిగువనే..**

ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యమైన 4 శాతం దిగువనే కొనసాగుతుండటంతో రేట్ల పాజ్‌ను చేపట్టవచ్చని ఆర్థికవేత్తలు, ట్రెజరీ నిపుణులు పేర్కొన్నారు. ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని పరిశీలించేందుకు ఆర్‌బీఐ మరికొంతకాలం వేచిచూసేందుకు అవకాశమున్నదని ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ఎకానమిస్ట్ గౌర సేన్‌గుప్తా అభిప్రాయపడ్డారు. గతేడాది వృద్ధికి మద్దతుగా ఎంపీసీ రెపో రేటులో మొత్తం 1.25 శాతం కోత పెట్టిన సంగతి తెలిసిందే.

# బోనస్ షేర్లు ఇస్తోన్న దిగ్గజ బ్యాంక్..




స్మాల్ క్యాప్ కేటగిరిలోని బ్యాంకింగ్ సెక్టార్ సంస్థ సిటీ యూనియన్ బ్యాంకు లిమిటెడ్ తమ షేర్ హోల్డర్లకు బంపర్ ఆఫర్ తీసుకొచ్చింది. ఈ బ్యాంక్ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ కొద్ది రోజుల క్రితం సమావేశమై తమ షేర్ హోల్డర్లకు బోనస్ షేర్లు జారీ చేయాలని నిర్ణయించారు. తాజాగా ఈ బోనస్ షేర్ల జారీ రికార్డు డేట్ జూన్ 12గా నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. అంటే జూన్ 12న ఈ కంపెనీ షేర్లు ఎక్స్‌బోనస్ ట్రేడ్ చేయనున్నాయి. అంటే జూన్ 11వ తేదీన మార్కెట్లు ముగిసే నాటికి ఈ బ్యాంకు షేర్లు కొనుగోలు చేసి ఉన్న వారికి బోనస్ షేర్లు అందుకునేందుకు అర్హత లభిస్తుంది. ప్రతి 3 ఈక్విటీ షేర్లకు 1 షేరు ఉచితంగా లభిస్తుంది. ఒకవేళ మీ వద్ద 300 షేర్స్ ఉంటే మీరు 100 షేర్స్ ఉచితంగా పొందుతారు. మరోవైపు ఈ కంపెనీ షేర్ గత ఏడాదిలో 24 శాతం లాభాన్నిఅందించింది.

కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్ ప్రకారం.. ఇటీవలే జరిగిన కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో 1:3 రేషియోలో బోనస్ షేర్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. దీని అర్థం రికార్డు డేట్ నాటికి రూ. 1 ఫేస్ వ్యాల్యూ ఉన్న 3 ఈక్విటీ షేర్లు కొనుగోలు చేసి తమ డీమ్యాట్ అకౌంట్లో కలిగి ఉన్నవారికి అదనంగా రూ. 1 ఫేస్ వ్యాల్యూ గల 1 ఈక్విటీ షేర్ బోనస్ రూపంలో ఉచితంగా అందించనున్నారు. ఈ బోనస్ షేర్లు అందుకునేందుకు అర్హులైన షేర్ హోల్డర్లను నిర్ణయించే రికార్డు డేట్ జూన్ 12, 2026గా నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. స్టాక్ మార్కెట్ చివరి ట్రేడింగ్ సెషన్లో సిటీ యూనియన్ బ్యాంకు షేరు ధర 1.6 శాతం నష్టపోయి రూ. 250 వద్ద ముగిసింది. ఈరోజు మరో 0.76 శాతం నష్టంతో రూ.247.70 వద్ద ట్రేడవుతోంది. ఇక ఈ షేరు 52 వారాల గరిష్ఠం ధర రూ. 324.10 వద్ద ఉండగా 52 వారాల కనిష్ఠ ధర రూ. 187.05 వద్ద ఉంది. గత వారం రోజుల్లో ఈ షేరు 2 శాతం నష్టపోయింది. గత నెల రోజుల్లో 8 శాతం పడిపోయింది. గత ఆరు నెలల్లో 10 శాతం నష్టపోయింది. గత ఏడాది కాలంలో 22 శాతం లాభాన్ని లాభాన్ని ఇచ్చింది. గత ఐదేళ్ల కాలంలో 50 శాతం లాభాన్ని తమ వాటాదారులకి అందించింది. ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ. 18,410 కోట్లుగా ఉంది.

**ప్రధాని మోదీ కేబినెట్ భారీ నజరానా..**

# విమాన ఇంధన నిధికి రూ.10,000 కోట్లు ఆమోదం!

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు బుధవారం (జూన్ 03) జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. దేశంలో విమానయాన రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు, అంతర్జాతీయంగా ఇంధన ధరల్లో వచ్చే హెచ్చుతగ్గుల నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్రం ఒక వినూత్న అడుగు వేసింది. ఇందులో భాగంగా "విమాన ఇంధన ధరల స్థిరీకరణ నిధి" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిధి కోసం ఏకంగా రూ. 10,000 కోట్లను కేటాయిస్తున్నట్లు కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు నిరంతరం మారుతుండటంతో విమాన ఇంధన ధరలు కూడా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఇది విమానయాన సంస్థలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపడమే కాకుండా, సామాన్య ప్రయాణికులపై టికెట్ ధరల రూపంలో ప్రభావం చూపుతోంది. తాజా నిధి కేటాయింపుతో ఇంధన ధరల్లో స్థిరత్వం ఏర్పడుతుందని, తద్వారా విమానయాన రంగం సంక్షోభంలో పడకుండా కాపాడవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. కేవలం విమానయాన రంగమే కాకుండా, దేశ ప్రగతికి ఊతమిచ్చేలా ఈరోజు జరిగిన కేబినెట్ భేటీలో మరికొన్ని కీలక నిర్ణయాలకు కూడా ఆమోదముద్ర పడినట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పన, ఆర్థిక వృద్ధిని పెంచే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL

# జపాన్‌లో మసీదు.. పాక్ పరువు పాయె!

***పరాయి దేశంలో పాకిస్థాన్‌కు పరువు పొగొట్టుకుంది. ఆ దేశ పౌరులు అక్కడ ఓ మసీదును నిర్మించడమే అందుకు కారణం. పైగా దానిని ఆ దేశ రాయబారితోనే అట్టహాసంగా ప్రారంభించింది. అయితే వారం తిరగకుండానే స్థానిక అధికారులు మసీదు నిర్వాహకులకు షాకిచ్చారు. కాస్త ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే..***



జపాన్‌లోని సైతామా ప్రిఫెక్చర్‌లో ఉన్న కవగోయే నగరంలో నిర్మించిన ఓ మసీదు వివాదాస్పదంగా మారింది. నగర ప్రణాళిక చట్టాల ప్రకారం ప్రత్యేక అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టరాని ప్రాంతంలో ఈ మసీదును నిర్మించినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. సుమారు 4,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం పర్వత అటవీ భూమిగా నమోదై ఉంది. ఇది అర్బనైజేషన్ కంట్రోల్ ఏరియా పరిధిలోకి వస్తుంది. ఇలాంటి ప్రాంతాల్లో స్థానిక ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం నిషేధం.అయితే మసీదు నిర్మాణానికి అవసరమైన అనుమతులు తీసుకోలేదని కవగోయే మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకోవడానికి కారణం పాకిస్థాన్ రాయబారి అబ్దుల్ హమీద్ ఈ ఏప్రిల్‌లో జరిగిన మసీదు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావడమే. దీంతో ఈ నిర్మాణానికి పాకిస్థాన్ ప్రభుత్వ మద్దతు ఉందా? అనే ప్రశ్నలు తలెత్తాయి. అయితే వివాదం ముదరడంతో పాకిస్థాన్ రాయబార కార్యాలయం వివరణ ఇచ్చింది. మసీదు నిర్వాహకులు అన్ని అనుమతులు తీసుకున్నామని హామీ ఇవ్వడంతోనే రాయబారి కార్యక్రమానికి హాజరయ్యారని పేర్కొంది. స్థానిక చట్టాలను ఉల్లంఘించే ఏ ప్రాజెక్టుతోనూ తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. అలాగే జపాన్‌లో నివసిస్తున్న పాకిస్థానీ కమ్యూనిటీకి ప్రత్యేక విజ్ఞప్తి చేస్తూ, ప్రార్థనా మందిరాల నిర్మాణం సహా అన్ని అంశాల్లో స్థానిక చట్టాలను పూర్తిగా పాటించాలని కోరింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టవద్దని హెచ్చరించింది. ఇదే సమయంలో జపాన్‌లో చాలాకాలంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న యాషియో మసీదు ప్రతినిధి షకీల్ షేక్ మహ్మద్ కూడా ఈ నిర్మాణాన్ని తప్పుబట్టారు. స్థానిక ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ, చట్టబద్ధంగా అనుమతులు తీసుకుని మాత్రమే మసీదులు నిర్మించాలని సూచించారు. మొత్తంగా మసీదు ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన కొద్ది రోజులకే అది అక్రమ నిర్మాణంగా మారడం పాకిస్థాన్‌కు ఇబ్బందికర పరిస్థితిని తీసుకొచ్చింది. జపాన్ వంటి చట్టాల అమలులో కఠినంగా వ్యవహరించే దేశంలో ఈ ఘటన ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

# భారత్‌కు మరోసారి అమెరికా సుంకాల షాక్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌మరోసారి భారత్‌కు షాకిచ్చారు. బలవంతపు కార్మిక విధానానికి నిరోధానికి సరైన చర్యలు తీసుకోలేదనే కారణంతో కనీసం 60 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై కొత్త పన్నులు విధించాలని అమెరికా సిద్ధమవుతున్నారు. భారతదేశం, చైనా, యూరోపియన్ యూనియన్, జపాన్‌లతో సహా 60 దేశాల నుండి దిగుమతి అయ్యే వస్తువులపై 12.5 శాతం వరకు అదనపు టారిఫ్‌లు (పన్నులు) విధించాలని ప్రతిపాదించింది. ఈ దేశాలు బలవంతపు శ్రమతో (వెట్టిచాకిరీ/forced labour) తయారైన వస్తువులపై నిషేధాన్నివిధించడంలో లేదా వాటిని కఠినంగా అమలు చేయడంలో విఫలమయ్యాయని USTR నిర్ధారించింది. ఫిబ్రవరిలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అనేక సుంకాలను సుప్రీం కోర్టు కొట్టివేసిన తర్వాత, మరింత శాశ్వతమైన సుంకాలను విధించే దిశగా అమెరికా పావులు కదుపుతోంది. భారత్, అమెరికాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై న్యూఢిల్లీలో కీలకమైన ఉన్నత స్థాయి చర్చలు జరుగుతున్న తరుణంలో ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ఈ జాబితాలో కెనడా, మెక్సికో, తైవాన్ , యూకే, చైనా, జపాన్, ఇండియా, దక్షిణ కొరియా, బ్రెజిల్ మరియు స్విట్జర్లాండ్ తదితర దేశాలున్నాయి. ఇందులో కెనడా, మెక్సికో, తైవాన్ , యూకే లపై 10 శాతం సుంకాలు, ఇతర దేశాలపై అదనంగా 12.5 శాతం సుంకం విధించనుంది. దీని ప్రకారం భారతదేశం నుంచి అమెరికాకు వెళ్లే వివిధ రకాల దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు అదనపు సుంకాలను విధించాలని యూఎస్‌టిఆర్ ప్రతిపాదించింది. ఈ కొత్త సుంకాలు తక్షణమే అమల్లోకి రావు. అవి ప్రజాభిప్రాయ సేకరణ ఉంటనుంది. అలాగే ఈ ప్రతిపాదనలపై తుది నిర్ణయం తీసుకునే ముందు మరిన్ని సంప్రదింపులు, సమీక్షలు జరగనున్నాయి. కానీ, ఒకవేళ ఇవి అమలులోకి వస్తే, సుప్రీంకోర్టు విధించిన సుంకాల పరిమితులను తప్పించుకోవడానికి యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఈ చర్య వీలు కల్పిస్తుంది. బలవంతపు కార్మికులతో తయారు చేసిన వస్తువుల దిగుమతిని పరిష్కరించడంలో ముఖ్యమైన వాణిజ్య భాగస్వాములు విఫలమవడం ఆమోదయోగ్యం కాదని USTR జామీసన్ గ్రీర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల అమెరికన్ కార్మికులు ప్రపంచవ్యాప్తంగా అసమాన పోటీ క్షేత్రంలో పోటీ పడవలసి వస్తుందని ఆయన అన్నారు. ఇలాంటి విఫల విధానాల వల్ల కంపెనీలు తక్కువ ఖర్చుతో వస్తువులను తయారు చేస్తూ, మార్కెట్ పరిస్థితులను దెబ్బతీస్తున్నాయని పేర్కొంది. (అమెరికా చట్టాల తరహాలో భారతదేశంలో ప్రస్తుతం బలవంతపు శ్రమ వస్తువుల దిగుమతిపై ప్రత్యేక నిషేధ చట్టమేదీ లేదు.) అయితే, ప్రతిపాదిత సుంకాలతో పాటు గొడ్డు మాంసం, కాఫీ, కొన్ని రకాల పండ్లు మరియు గింజల వంటి వాటికి వివిధ మినహాయింపులు ఉన్నాయి. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి లోబడి ఉండే కెనడా మరియు మెక్సికో వస్తువులకు కూడా మినహాయింపు ఉంటుంది. అలాగే కొన్ని వస్త్రాలు, దుస్తులకు కూడా. జూలై 6 లోగా తమ లిఖితపూర్వక అభిప్రాయాలను తెలియజేయాలని ప్రజలను కోరింది.

# రష్యా బస్సు ధ్వంసం.. ఏడుగురు మృతి!



**కీవ్:** రష్యాఉక్రెయిన్ మధ్య యుద్ధం మరోసారి భీకర రూపం దాల్చింది. ఉక్రెయిన్ దళాలు జరిపిన డ్రోన్ దాడిలో రష్యా ఆధీనంలోని తూర్పు ఉక్రెయిన్ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఒక సివిలియన్ బస్సు పూర్తిగా ధ్వంసమైంది. ఈ దారుణ ఘటనలో ఏడుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 11 మంది తీవ్రంగా గాయపడ్డారు. రష్యా ఇటీవల ఉక్రెయిన్ మౌలిక వసతులే లక్ష్యంగా క్షిపణి దాడులు చేసిన మరుసటి రోజే ఈ ప్రతీకార దాడి జరగడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది.

**బస్సు సరిహద్దుల్లోకి రాగానే..**

మాస్కో నుండి క్రిమియా ద్వీపకల్పంలోని సింఫెరోపోల్‌కు బయలుదేరిన ఒక ప్యాసింజర్ బస్సు డొనెట్స్క్ సరిహద్దుల్లోకి రాగానే ఉక్రెయిన్ డ్రోన్ దాడికి గురైంది. ఈ దాడి తీవ్రతకు బస్సు పూర్తిగా తునాతునకలయ్యింది. డొనెట్స్క్ ప్రాంత రష్యా గవర్నర్ డెనిస్ పుషిలిన్ టెలిగ్రామ్ వేదికగా స్పందిస్తూ, ఎనకీవ్ సమీపంలో జరిగిన ఈ యూఏవీ దాడిలో ఏడుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని, గాయపడిన 11 మందికి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

**ముంచెత్తిన 354 డ్రోన్లు**

మరోవైపు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. సరిహద్దులు దాటి వచ్చిన ఉక్రెయిన్ వైమానిక దళం ఒకే రాత్రిలో రష్యాపైకి భారీగా డ్రోన్లను ప్రయోగించింది. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు అప్రమత్తమై సరిహద్దు ప్రాంతాలైన బెల్గోరోడ్, కుర్స్క్, మాస్కో పరిసర ప్రాంతాలు, అజోవ్ సముద్ర తీరంలో మొత్తం 354 ఉక్రెయిన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా పేర్కొంది. ఇరు దేశాల మధ్య 2022 ఫిబ్రవరిలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఈ స్థాయిలో పరస్పర వైమానిక దాడులు జరగడం ఇదే మొదటిసారి.

**రష్యాలోనూ ఎదురుదెబ్బ**

ఈ సుదీర్ఘ పోరులో ఉక్రెయిన్‌లోని ఖేర్సన్ ప్రాంతంపై రష్యా జరిపిన డ్రోన్ దాడిలో 86 ఏళ్ల వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక సైనిక యంత్రాంగం తెలిపింది. అంతకుముందు రోజు రష్యా ఏకంగా 73 క్షిపణులు, 656 డ్రోన్లతో ఉక్రెయిన్ రాజధాని కీవ్, డ్నిప్రో నగరాలపై భారీ దాడికి పాల్పడింది. ఈ దాడి ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థలను తాత్కాలికంగా నిర్వీర్యం చేయడమే కాకుండా, ఉక్రెయిన్ ప్రతీకార దాడులను మరింత తీవ్రతరం చేయడానికి కారణంగా నిలిచింది.

# బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం

**పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం చోటు చేసుకుంది. ప్రతిపక్ష తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో భారీ చీలిక చోటు చేసుకుంది. పార్టీ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే రీటా బ్రతా బెనర్జీ.. ఇవాళ అసెంబ్లీలోకి వెళ్లి తనకు మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ ప్రకటించారు. ఈ పరిణామంతో తర్వాత ఏం జరగనుందా? అనే ఉత్కంఠ నెలకొంది.**

టీఎంసీ సస్పెండెడ్ ఎమ్మెల్యే రీటా బ్రతా బెనర్జీ.. పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేల మద్దతు ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. సుమారు 50 మంది ఎమ్మెల్యేలు తనకు మద్దతు తెలుపుతున్నారని, దీంతో కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉందని అంటున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో తిరుగుబాటు వర్గం ఆయనను ప్రతిపక్ష నేత (LoP)గా నిలబెట్టే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. దీంతో అసెంబ్లీలో అధికార టీఎంసీకి వ్యతిరేకంగా కొత్తశక్తి రూపుదిద్దుకుంటుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది. బెంగాల్‌లో టీఎంసీ దారుణ ఓటమి తర్వాత.. ఆ పార్టీలో మమతా బెనర్జీ నాయకత్వంపై అసంతృప్తి బయటపడుతోంది. ఇక ఇటీవల మమతా బెనర్జీ అధ్యక్షతన జరిగిన టీఎంసీ కీలక సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంతో అది దాదాపు ఖాయమైంది. అదే సమయంలో అసంతృప్త ఎమ్మెల్యేలంతా విడిగా ఓ హెటల్‌లో సమావేశం అయ్యారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రీటా బ్రతా బెనర్జీ చేసిన తాజా వ్యాఖ్యలు టీఎంసీ అంతర్గత రాజకీయాలను మరింత ఉద్రిక్తంగా మార్చాయి. పార్టీ చీలిక నిజంగానే జరుగుతోందా? లేదంటే ఇది తాత్కాలిక అసంతృప్తి మాత్రమేనా? అన్నది బెంగాల్ రాజకీయాల్లో ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. టీఎంసీలో కొనసాగుతున్న అంతర్గత అసంతృప్తి మరింత పెరిగితే పార్టీపై మమతా బెనర్జీ పట్టు బలహీనపడే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యేల సంఖ్యాబలం కీలకంగా మారితే.. పార్టీ ఆమె చేజారి పోవచ్చని చెబుతున్నారు. ఈ క్రమంలో గతంలో మహారాష్ట్ర రాజకీయాలు ఉదాహరణగా చెబుతున్నారు. 2022లో మహారాష్ట్రలోని రాజకీయ సంక్షోభం అందరికీ గుర్తుండే ఉంటుంది. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేనలో మొదలైన అసంతృప్తి.. ఏక్‌నాథ్ షిండే వర్గం భారీగా ఎమ్మెల్యేలను తమవైపు తిప్పుకోవడంతో అసెంబ్లీలో మెజారిటీ సమీకరణం మారిపోయింది. చివరికి పార్టీ గుర్తు, నాయకత్వం కూడా మారిన పరిణామం రాజకీయంగా పెద్ద మలుపుగా నిలిచింది. రీటా బ్రతా బెనర్జీ చేసిన 50 మంది ఎమ్మెల్యేల మద్దతు వ్యాఖ్యలు ఆ దిశగా సంకేతాలిస్తున్నాయనే చెప్పొచ్చు.



## హాట్ పిక్స్ తో కాకరేపుతున్న
# కన్నప్ప బ్యూటీ..

యంగ్ హీరో శ్రీవిష్ణు నటించిన 'ఓం భీమ్ భుష్' సినిమాతో ప్రీతి ముకుందన్ తెలుగు ప్రేక్షకులకు మొదటిసారి పరిచయమైంది. ఆ తర్వాత మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'కన్నప్ప' సినిమాలో కీలకమైన 'నెమలి' అనే పాత్రను దక్కించుకుంది. పాన్ ఇండియా లెవెల్లో భారీ అంచనాలతో రూపొందిన 'కన్నప్ప' సినిమాలో ప్రీతి ముకుందన్ లుక్స్, ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది.సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో భారీ విజయం సాధించకపోయినప్పటికీ, ఈ ముద్దుగుమ్మ అందచందాలు మరియు అభినయానికి మాత్రం సినీ పరిశ్రమ వర్గాల నుంచి ప్రశంసలు దక్కాయి.ప్రీతి ముకుందన్ టీవీ షోలో నృత్య ప్రదర్శనలలో తన కెరీర్ ను ప్రారంభించింది.. ఆతర్వాత పలు ఆల్బమ్స్ చేసింది.ప్రీతి ముకుందన్ మొదటి మ్యూజిక్ ఆల్బమ్ 'ముత్తు ము2' యూట్యూబ్ లో 4.2 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి పేరొందినది.సోషల్ మీడియాలో అందాల ఆరబోతతో కుర్రాళ్లకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ చిన్నది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు చుస్తే నోరెళ్లబెట్టాల్సిందే..

# రణ్‌వీర్ సింగ్‌పై నిషేధం ఎత్తివేత





బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్‌కు బిగ్ రిలీఫ్ దక్కింది. ఆయనపై విధించిన నాన్ కో ఆపరేషన్(సహాయ నిరాకరణ) ఆదేశాలను ఉపసంహరించుకున్నట్లు ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రర్న్ సినీ ఎంప్లాయిస్ యూనియన్(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) ప్రకటించింది. ఈ విషయాన్ని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ అధ్యక్షుడు బీఎన్ తివారీ ప్రకటించారు. సినీ కార్మికుల సంఘాలు, నిర్మాతల మండలి అభ్యర్థన మేరకు రణవీర్ సింగ్‌పై విధించిన ఆంక్షలను తక్షణమే ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. రణ్‌వీర్ లీగల్ నోటీసులు పంపిన అనంతరం అతనిపై నిషేధం తొలగించారు. మొదట డాన్3 మూవీ విషయంలో తలెత్తిన వివాదంతో రణ్‌వీర్ సింగ్‌పై నిషేధం విధించారు. ఫర్హాన్ అక్తర్ 'డాన్ 3' ప్రాజెక్ట్ నుంచి రణ్‌వీర్ సింగ్ అర్ధాంతరంగా తప్పుకోవడంతో వివాదం మొదలైంది. తనపై నిషేధాన్ని తొలగించాలని రణ్‌వీర్ కోరాడని ఫెడరేషన్ ముఖ్య సలహాదారు, ఫిల్మ్ మేకర్ అశోక్ పండిట్ వెల్లడించారు. ఈ వివాదంపై డాన్ 3 మేకర్స్‌తోనే చర్చించుకోవాలని రణ్‌వీర్‌కు చెప్పామని తెలిపారు. ఈ విషయంలో అతని నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. అయితే రణ్‌వీర్ సింగ్ పంపిన లీగల్ నోటీసుకు చట్టపరమైన మార్గాల ద్వారానే స్పందిస్తామని కూడా ఫెడరేషన్ తెలిపింది. మరోవైపు ఏ కళాకారుడిపైనా నిషేధం విధించే అధికారం ఫెడరేషన్‌కు లేదని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ముఖ్య సలహాదారు అశోక్ పండిట్ అన్నారు. దయచేసి నిషేధం అనే పదాన్ని ఉపయోగించవద్దని ఆయన మీడియాను కోరారు. ఒక వ్యక్తితో కలిసి పనిచేయవద్దని తన సభ్యులకు కేవలం సలహా మాత్రమే ఇవ్వగలదని తెలిపారు. ఎవరినీ వారి వృత్తిని కొనసాగించకుండా నిరోధించలేదని స్పష్టం చేశారు. రణ్‌వీర్ సింగ్ పంపిన నోటీసును ఫెడరేషన్ న్యాయ బృందం పరిశీలిస్తోందని.. దీనికి న్యాయ మార్గాల ద్వారా స్పందిస్తామని పండిట్ వెల్లడించారు. ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చర్చలకు సిద్ధంగా ఉందని.. ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడానికి రణ్‌వీర్ సింగ్ కూడా చర్చలో పాల్గొంటారని ఆశిస్తున్నామని తెలిపారు. ఇకనైనా ఈ వివాదానికి ఫుల్ స్టాప్ పడుతుందేమో వేచి చూడాల్సిందే.



## తెలుగులో నటించడాన్ని
# చాలా ఆస్వాదిస్తున్నా..

అతిలోకసుందరి శ్రీదేవి వారసురాలు జాన్వీ కపూర్.. పాన్ ఇండియా హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంటోంది. బాలీవుడ్‌లో ఇప్పటికే పలు మూవీస్ చేసి తనకంటూ ప్రత్యేక క్రేజ్ సంపాదించుకుంది. తన తల్లి శ్రీదేవిలా దక్షిణాది సినిమాల్లోనూ నటించి పేరు తెచ్చుకోవాలనేది ఈ బ్యూటీ కోరిక. అలా ఇప్పటికే తెలుగులో 'దేవర'లో చేసింది. పరం సుందరి'లో మలయాళీ అమ్మాయిలా నటించింది. ఈమె నటించిన 'పెద్ది' ఇప్పుడు విడుదలకు సిద్ధమైంది. దీనిపై చాలా ఆశలు పెట్టుకుందనే చెప్పొచ్చు. ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ దక్షిణాది భాషల గురించి, మరీ ముఖ్యంగా మలయాళ భాష గురించి జాన్వీ తన అభిప్రాయాన్ని చెప్పింది. మలయాళ భాష చాలా అందమైనది, మధురమైనది. అయినా నాకు చాలా కష్టమైనది. అందుకే ప్రస్తుతానికి మలయాళ చిత్రాల్లో నటించాలనుకోవడం లేదు. మలయాళం కంటే తెలుగు, తమిళ భాషలు నాకు కొంచెం పరిచయం ఉన్నవిగా అనిపిస్తాయి. అందుకే తెలుగు సినిమాల్లో నటించడాన్ని చాలా ఆస్వాదిస్తున్నా. తమిళ చిత్రాల్లో నటించాలని అనుకుంటున్నానని జాన్వీ చెప్పుకొచ్చింది. అయితే జాన్వీ త్వరలోనే కోలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుందనే రూమర్స్ వస్తున్నాయి.




## హిట్స్ లేకపోయినా భాగ్యశ్రీ క్రేజ్ మాత్రం
# ఎక్కడ తగ్గడం లేదు..

భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు కుర్రాళ్ల కొత్త నేషనల్ క్రష్. మాస్ మహరాజా రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. భారీ అంచనాలు మధ్య విడుదలైన ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. కానీ అందరి దృష్టిని ఆకర్షించింది ఈ అమ్మడు.తొలి చిత్రంలోనే గ్లామర్ షోతోపాటు అభినయంతో కట్టిపడేసింది ఈ వయ్యారి. కానీ ఫస్ట్ మూవీ డిజాస్టర్ కావడంతో ఆమెకు పెద్దగా హెల్ప్ కాలేదు.అయితే తెలుగులో నెమ్మదిగా ఆఫర్స్ మాత్రం అందుకుంది. వరుసగా నాలుగైదు సినిమాలతో బిజీగా మారిపోయింది. కానీ ఈ ముద్దుగుమ్మ నటించిన ఒక్క సినిమా కూడా హిట్ అవ్వలేదు. అయినా కూడా ఈ ముద్దుగుమ్మ క్రేజ్ ఎక్కడ తగ్గడంలేదు. చివరిగా రామ్ పోతినేని సరసన ఆంధ్రా కింగ్ తాలూకా, అలాగే దుల్కర్ సల్మాన పక్కన కాంత సినిమాలు చేసింది. కానీ అవి హిట్ అవ్వలేదు. ప్రస్తుతం అఖిల్ నటిస్తున్న లెనిన్ సినిమా పైనే ఈ ముద్దుగుమ్మ బోలెడన్ని ఆశలు పెట్టుకుంది. ఇటీవల విడుదలైన టీజర్ ఆకట్టుకుంది. కాగా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ కుర్రది.. తన క్రేజీ ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది. ఈ బ్యూటీ ఫోటోలకు ఫిదా అవుతున్నారు నెటిజన్స్.



# అందాల అరాచకం..

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, తన గ్లామరస్ ఫోటోలతో నెటిజన్లను అలరిస్తున్న యువ నటి రమ్య పసుపులేటి ఇప్పుడు టాలీవుడ్‌లో రాణిస్తుంది. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన రమ్య, ఆ తర్వాత టిక్ టాక్ వీడియోలు, ఇన్ స్టాగ్రామ్ రీల్స్ ద్వారా విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ అమ్మడుకు ఫాలోయింగ్ ఎక్కువే. తన అందం, అభినయంతో కుర్రాళ్ల గుండెల్లో గూడు కట్టుకుంది, క్రమంగా సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. 'హుషారు' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది.ఆ తర్వాత 'ఫస్ట్ ర్యాంక్ రాజు', 'మైల్స్ ఆఫ్ లవ్', 'కమిట్‌మెంట్', 'మారుతి నగర్ సుబ్రమణ్యం' వంటి సినిమాల్లో నటించింది. ప్రస్తుతం రమ్య పసుపులేటి కెరీర్ ఊపందుకుంది.ఆమె మెగాస్టార్ చిరంజీవి ప్రతిష్టాత్మక చిత్రం 'విశ్వంభర'లో కీలక పాత్రలో నటిస్తోంది. ఈ సినిమాలో ఆమె చిరంజీవికి చెల్లెలిగా కనిపించనుందని సమాచారంసోషల్ మీడియాలో ఎప్పుడూ తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను పెంచుకుంటున్న రమ్య, క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారనున్నట్లు తెలుస్తోంది.చైల్డ్ ఆర్టిస్ట్‌గా మొదలై, ఇప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో నటిస్తూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం పట్ల అభిమానులు ఆమెను ప్రశంసిస్తున్నారు.అద్భుతమైన గ్లామర్, నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ యువ నటి, రాబోయే రోజుల్లో టాలీవుడ్‌లో మరింత బిజీ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



## మల్టీప్లెక్స్, సింగిల్ స్క్రీన్..
# ఒకటే టికెట్ రేటా?

'పెద్ది' సినిమా మరికొన్ని గంటల్లో థియేటర్లలోకి రానుంది. ఆంధ్రా, ఓవర్సీస్‌లో రెండు మూడు రోజుల ముందే టికెట్ బుకింగ్స్ ఓపెన్ చేసినప్పటికీ తెలంగాణలో మాత్రం రిలీజ్‌కి కొన్ని గంటల ముందు తెరిచారు. ఇక తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం సింగిల్ స్క్రీన్లకు రూ.100, మల్టీప్లెక్స్‌ల్లో ఒక్కో టికెట్‌పై రూ.150 పెంచుకోవచ్చని పేర్కొన్నారు. కానీ హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో మాత్రం ఒక్కో టికెట్ రూ.420 ఉండటం షాకిచ్చింది. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని దేవి 70ఎమ్ఎమ్ థియేటర్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ఈ థియేటర్‌లో రిలీజ్ రోజు నుంచి రెగ్యులర్ షోల కోసం టికెట్ రూ.420 అన్నట్లు బుక్ మై షోలో చూపించింది. మిగతా సింగిల్ స్క్రీన్లలో సెకండ్ క్లాస్ టికెట్ పెంపుతో కలిపి రూ.150 రూపాయలు ఉంటే దేవిలో మాత్రం రూ.420 ఉంది. దీంతో పలువురు నెటిజన్లు ఈ పెంపుపై విమర్శలు చేస్తున్నారు.

ఎందుకంటే ఏఎంబీ, ఏఏఏ లాంటి మల్టీప్లెక్స్‌ల్లో రూ.420, దేవి లాంటి సింగిల్ స్క్రీన్‌లోనూ రూ.420 టికెట్ రేటు ఉండటమేంటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఈ విషయం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిపోయింది. ప్రస్తుతానికైతే సినిమాపై బజ్ బాగానే ఉంది గానీ ఈరోజు రాత్రికల్లా అసలు టాక్ ఏంటనేది బయటకొస్తుంది. అప్పుడు టికెట్ సేల్స్‌లో హెచ్చుతగ్గులు కనిపించడం గ్యారంటీ.

'పెద్ది' ప్రీ సేల్స్ విషయానికొస్తే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.35 కోట్లకు పైనే వసూళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. ఉత్తర అమెరికాలో ఇప్పటికే 1.1 మిలియన్ డాలర్లకు పైనే టికెట్ సేల్స్ జరిగినట్లు అధికారికంగా ప్రకటించారు. పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. మరి తొలిరోజు ఎన్ని కోట్ల కలెక్షన్స్ సాధిస్తుందో చూడాలి?

# ఘోర ప్రమాదం.. పండు మాస్టర్‌కి తీవ్ర గాయాలు

'ఢీ' ఫేమ్ పండు మాస్టర్ తీవ్రంగా గాయపడ్డాడు. డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ అయిన ఇతడు ప్రమాదానికి గురయ్యారు. ఒక ప్రైవేట్ కార్యక్రమం కోసం విశాఖపట్నం వెళ్తుండగా ఈ రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నంలో జరిగే ఒక ఈవెంట్‌లో పాల్గొనేందుకు పండు మాస్టర్ తన టీమ్‌తో ప్రయాణమవుతుండగా ఆనందపురం మండలం లొతగలవానిపాలెం హైవేపై అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఆయనను సమీపంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు ఆయనకు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఆగి ఉన్న రెండు వాహనాలను బొలెరో కోళ్ల వ్యాన్ ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న డాన్స్ మాస్టర్ పండుకు రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలవగా ఆసుపత్రికి తరలించారు. నిద్రమత్తు, అతివేగమే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. ప్రమాదానికి గురైన మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు.. ఘటన స్థలాన్ని పరిశీలించారు.



OWNED BY N SREENIVAS RAO. EDITED, PRINTED AND PUBLISHED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com